ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 22 నవంబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 21.0

ఎంఎన్ పాలెం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

నూజివీడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం ముకాసనర్సన్నపాలెం(ఎంఎన్ పాలెం) సర్పంచ్ బోయపాటి మాధవి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. 2015-20 మధ్య కాలంలో అప్పటి సర్పంచ్‌గా పనిచేసిన దాసరి శ్రీరేఖ పదవీకాలంలో ఎన్ఆర్‌జీఎస్ పథకంలో రోడ్లు, సీసీ రోడ్లు అభివృద్ధి చేశారు. తదనంతరం నిధులు ఆలస్యంగా విడుదల య్యాయి. ఈనేపథ్యంలో 2021లో బోయపాటి మాధవి సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే గతంలో చేసిన పనుల తాలూకా బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించకుండా మాధవి ఈ పనులకు విడుదలైన మొత్తాలను వేరే వాటికి మళ్లించారని శ్రీరేఖ హైకోర్టును ఆశ్రయించారు. ఈనేపథ్యంలో డీపీవో ఆదేశాల మేరకు పలుమార్లు విచారణలు జరిగాయి. ఇందులో చెల్లింపులు తప్పుగా జరిగాయని తేలింది. మాధవి హయాంలోనే 18లక్షల 40వేల 676లను దుర్వినియోగం చేశారంటూ నిర్ధారణ జరిగింది. దీంతో మాధవి చెక్‌పవర్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ 2వ తేదీ వరకు నిలుపుదల చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఆర్ ఏఎస్పీగా మునిరాజా

ఏలూరు క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్మ్డు రిజర్వుడు విభాగం అదనపు ఎస్పీగా జి.మునిరాజాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఆయనను ఏలూరు జిల్లా ఆర్మ్డు రిజర్వుడు విభాగం ఏఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొప్పాక జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం సస్పెన్షన్

ఏలూరు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ నిధుల దుర్వినియోగం, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఛైర్‌పర్సన్, సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేయడం వంటి అభియోగాలు విచారణలో రుజువు కావడంతో పెదవేగి మండలం కొప్పాక జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఆర్‌.శైలజను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య కాకినాడ ఆర్జేడీ జి.నాగమణి ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలపై సమగ్రశిక్ష అభియాన్ ఏఎంవో రామారావు, దెందులూరు ఎంఈవో ప్రసాద్ స్కూలులో విచారణ నిర్వహించి అందజేసిన నివేదిక ఆధారంగా ప్రధానోపాధ్యాయినిని సస్పెండ్ చేశారని వివరించారు.

గురుకులం టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

జంగారెడ్డిగూడెంలో ఘటన

పాఠశాల వద్ద బంధువుల ఆందోళన



కావ్య (ఫైల్)

పీఆర్ 126పై నీలినీడలు

లోపలి పేజీలో..



వైభవంగా శివపార్వతుల కల్యాణం

కుక్కునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరులోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో శుక్రవారం శివపార్వతులకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, మధ్యాహ్నం కల్యాణం, సాయంత్రం రుద్రహోమం నిర్వహించారు. దాదాపు రెండు వేల మంది భక్తులు హాజరై కల్యాణాన్ని వీక్షించారు.అర్చకులు నవీన్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరిపారు.

భక్తిశ్రద్ధలతో పోలిస్వర్గం పూజలు



కార్తీకమాసం ముగింపు, పోలి పాడ్యమిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక పోలి స్వర్గం పూజలను నిర్వహించారు. కాలువల్లో దీపాలు వదిలారు. ద్వారకాతిరుమల సుదర్శన పుష్కరిణిలో తెప్పలను కోనేటిలో వదులుతున్న మహిళా భక్తులు.

సా..గుతున్న రీ సర్వే!

నెలాఖరుకు మూడో దశ పూర్తికి కసరత్తు

జిల్లాలో భూముల రీ సర్వే ప్రహసనంలా సాగుతోంది. ఈ నెలాఖరు నాటికి మూడో విడత సర్వే పూర్తి చేయడానికి సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒక పక్క పంటల కోతలు.. మరో పక్క విపరీతమైన చలిగాలులతో సర్వే ప్రక్రియ కొంత మందకొడిగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా భూముల రీ సర్వే చేయాలంటే మరో నాలుగు దశలు చేపట్టాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- మందకొడిగా సాగుతున్న సర్వే
- మరో నాలుగు దశల్లో చేస్తేనే అంతా పూర్తి

జిల్లాలో భూముల రీ సర్వేపై అధికారులు కుస్తీలు పడుతున్నారు. ఈ ఏడాది జనవరి 20న తొలి విడత పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన మొదలుకుని.. ఇప్పుడు మూడో దశ వరకు చాలా వరకు పురోగతి కనిపిస్తోంది. ప్రధానంగా వైసీపీ హయాంలో చేపట్టి జగనన్న భూహక్కుల సర్వే మాయాజాలంతో రైతులు జిల్లా అంతటా ఇబ్బందులే ఎదుర్కొన్నారు. భూముల సరిహద్దుల వివాదాల లెక్క తేల్చేందుకు కూటమి ప్రభుత్వం వ్యయప్రయాసల కోర్చి ఈ కార్యక్రమం చేపట్టింది. దాదాపుగా 11 నెలలుగా సర్వే ప్రక్రియ సాగుతోంది. ఇటీవల మూడు నెలలు భారీ వర్షాలు, మొంథా తుఫాన్ మూడో దశ సర్వేకు శరాఘాతంగా మారాయి. మరోవైపు పీజీఆర్ఎస్‌లో, ఇతర చోట్ల రీ సర్వే, ఆన్‌లైన్ అంశాల పైనే ప్రజలు భారీగా వినతులు ఇవ్వడంతో రీ సర్వేకు కొంత ఆటంకాలుగా పరిణమిస్తున్నాయి. జిల్లాలో ఇటీవల స్వమిత్ర సర్వే కింద గ్రామకంఠాలు, ఇళ్ల పట్టాల వ్యవహారాలపై సర్వేలను ల్యాండ్ అండ్ సర్వే అధికారులు చేస్తుండడంతో మూడో దశలో ఆటుపోట్లే ఎక్కువగా ఎదురవుతున్నాయి.



ఆగిరిపల్లిలో భూమి రికార్డులను పరిశీలిస్తున్న సర్వేశాఖ ఏడీ అన్సారీ, సర్వేయర్లు (ఫైల్)

191 గ్రామాలు.. నాలుగు విడతలు

జిల్లాలో మూడు విడతలుగా చేపట్టిన సర్వే పారదర్శకంగానే చేపట్టామని, ఇక వచ్చే ఏడాది నుంచి నాలుగు విడతలుగా 191 గ్రామాల్లో రీ సర్వే చేయాలని ప్రణాళికను రూపొందిస్తున్నామని సర్వేఅండ్ ల్యాండ్స్ రికార్డ్సు ఏడీ అన్సారీ తెలిపారు. అన్ని అంశాలు అనుకూలిస్తే 2026 చివర నాటికి పూర్తవుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

నెలాఖరుకు మూడో విడత పూర్తి

జిల్లాలో భూముల రీ సర్వేను మొదటి విడతలో 24 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా 24,605 ఎకరాల్లో ప్రారంభించారు. అనంతరం రెండోదశ కింద 30 గ్రామాల్లో 36,540 ఎకరాల్లో అధికారులు రీ సర్వేను పూర్తి చేశారు. రెండు విడతల్లోను భూములు కొలిచే రోవర్ల సంఖ్య తక్కువగా ఉండడంతో పనులు నెమ్మదించాయి. ఇప్పుడు మూడో విడత కింద సెప్టెంబరులో 59 గ్రామాల్లో సర్వే ప్రారంభించగా 105 రోవర్లను వినియోగిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో సరిహద్దులు గుర్తింపును 21,927 ఎకరాల్లో పూర్తి చేశారు. ప్రైవేట్ భూముల్లో - మిగతా 8లో



మొక్క నాటుతున్న రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని తదితరులు

స్వచ్ఛత స్ఫూర్తి కలిగి ఉండాలి

- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి

పెదపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరిలోనూ స్వచ్ఛత స్ఫూర్తిని కలిగి ఉండాలని, అప్పుడే గ్రామాలు సంపూర్ణ పారిశుధ్యంతో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌లుగా తీర్చిదిద్దబడతాయని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి తెలిపారు. వట్లూరులో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లతో కలిసి గ్రామంలో వీధులను శుభ్రం చేసి మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రూ.30 లక్షలు స్వచ్ఛ భారత్ నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, డీపీవో అనురాధ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను రూపొందించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

దూసుకొస్తున్న సెన్‌యార్

- చేలల్లోనే 75 శాతం పంట
- తుఫాన్ వస్తే భారీగా నష్టమే.. రైతుల్లో ఆందోళన
- నేటి నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం

ఏలూరుసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):సెన్‌యార్ తుఫాన్ దూసుకొస్తోంది. ఈనెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆపై పశ్చిమ వాయువ్య దిశగా పయనించి ఈనెల 24వ తేదీ నాటికి వాయుగుండంగా మారి దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుం దని ఐఎండీ చెబుతోంది. ఆ తదుపరి 48 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా పయనించే క్రమంలో తుఫాన్‌గా మారి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించి ఏపీ తీరం వైపునకు దూసుకు రానుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఇది కూడా మొంథా తుఫాన్‌లా కాకినాడ-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశాలున్నాయని, అయితే సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు , ఉత్తరాది నుంచి వచ్చే చలిగాలులు ప్రభావంతో తీరం దాటే సమయంలో మార్పులు ఉంటాయని చెబుతున్నారు. కోస్తా ప్రాంతంలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

రైతుల్లో ఆందోళన

ప్రస్తుతం జిల్లాలో వరి కోతలు మొదలయ్యాయి. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,07,203 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో వరి మాసూళ్ల పర్వంలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 50,568 ఎకరాల్లో (25 శాతం) వరి మాసూళ్లు పూర్తయ్యాయి. తుఫాన్ దృష్ట్యా వరితో పాటు పత్తి పంట రైతులను ఐఎండీ అప్రమత్తం చేసింది. గత నెలలో మొంథా తుఫాన్ జిల్లాను వణికించింది. జిల్లాలో దాదాపు 5704.24 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. ఉద్యాన పంటలు 17 హెక్టార్లలో దెబ్బతిని రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. మళ్లీ సెన్‌యార్ తుఫాన్ వస్తే పంట చేతికి దక్కే అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరాల పంటకు నష్టాన్ని మిగులుస్తుం దని రైతులు చెబుతున్నారు.



సానారుద్రవరంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పొలాలు

1,500 ఎకరాల్లో కోతకు సిద్ధంగా వరి పంట

కలిదిండి : వాతావరణంలోని మార్పులతో ఖరీఫ్ వరి పంట చేతికి వస్తుందో లేదోనని మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరి పైరు నేలకొరగడంతో కొంత పంట నష్టం జరిగింది. మిగిలిన పంట చేతికి అందే వచ్చేసమయంలో మళ్లీ మరో తుఫాన్ పొంచిఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలతో హడావిడిగా యంత్రాలతో వరి కోతలను కోస్తున్నారు. నేలకొరిగిన వరి పైరు యంత్రాలతో కోయడం సాధ్యం కావడం లేదు. ఈ పరిస్థితిలో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాల్లో వరి పంట కోతకు సిద్ధంగా ఉంది.

లోటుపాట్లకు తావు ఇవ్వొద్దు

- ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టరు, ఎస్పీ,ఎమ్మెల్యే

ఏలూరు/ద్వారకాతిరుమల/కొయ్యలగూడెం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఆయా శాఖల అధికారులు వేగవంతంగా పనులు పూర్తి చేయాలని కలెక్టరు వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. కొయ్యలగూడెం మండలం రాజవరం పెద్దచెరువు సమీపంలో ఉన్న దేవుడు మాన్యం భూముల్లో హెలీప్యాడ్‌ను, ద్వారకా తిరుమల మండలం జగన్నాథపురంలో మ్యాజిక్ డ్రెయిన్‌ను, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం యజ్ఞశాలలను శుక్రవారం కలెక్టర్‌తో పాటు ఎస్పీ కె.శివప్రతాప్ కిషోర్, జేసీ అభిషేక్ గౌడ, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరిశీలించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : ఎస్పీ

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సిబ్బందికి సూచించారు. ద్వారకా తిరుమల మండలం జగన్నాథపురం, ద్వారకా తిరుమలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు 24న డిప్యూటీ సీఎం పర్యటించే మార్గాలు, సభా స్థలాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ విభాగాల వారీగా డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ చేయాలని నిఘా కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. డీఎస్పీ డి.శ్రవణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, భీమడోలు ఎస్ఐ యుజే విల్సన్, పోలవరం సీఐ బాల సురేష్‌బాబు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టరు వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఎమ్మెల్యే బాలరాజు

గ్రామ/వార్డు సచివాలయాల్లో స్పౌజ్ కోటాలో ఉద్యోగుల బదిలీ

- 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- 30వ తేదీలోగా బదిలీ ప్రక్రియ పూర్తి

లోపలి పేజీలో..

పరిహారం..పాట్లు

- ఏళ్లు గడుస్తున్నా అందని వైనం.. నిర్వాసితుల ఎదురుచూపులు

కుక్కునూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో కుక్కునూరు 'ఏ' బ్లాక్ ముంపులో ఉంది. ప్రభుత్వం వ్యక్తిగత పునరావాస పరిహారం, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం అందిస్తోంది. అయితే కుక్కునూరు 'ఏ' బ్లాక్‌లో 90 ఇళ్లు పరిహార జాబితాలో తొలగించబడ్డాయి. నిర్వాసితులు పలుమార్లు ఆందోళనలు చేపట్టగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. కుక్కునూరు పంచాయతీ కార్యాలయంలో 90 ఇళ్లకు సంబంధించి తీర్మానం చేశారు. అయితే సర్వే సమయంలో ఈ సంఖ్య 120కి పెరగడం గమనార్హం. ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందడం లేదు. 90 ఇళ్లు సర్వే చేయాల్సి ఉండగా అక్రమాలు జరిగినందున ఆ సంఖ్య 120 వరకు పెరిగిందని కొందరు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం వ్యక్తిగత పునరావాస పరిహారం, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం జమ చేసింది. అయినప్పటికి కొందరి ఇళ్లకు పరిహారం పెండింగులో ఉంది. ప్రభుత్వం మరల ఇటీవల పెండింగులోని వ్యక్తిగత పునరావాస పరిహారం, ఇళ్లకు పరిహారం జమ చేస్తోంది. అయితే ఏడుగురు నిర్వాసితుల ఇళ్లకు గతంలో పరిహారం అందినప్పటికి మరలా రెండోసారి పరిహారం జమ అయినట్టు - మిగతా 8లో

సెల్‌ఫోన్‌తో దర్జాగా చినవెంకన్న ఆలయంలోకి..

- మూల విరాట్ ఫొటో తీసి వాట్సాప్ స్టేటస్
- తీవ్ర దుమారం రేపిన ఘటన



ద్వారకా తిరుమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న మూల విరాట్‌ను ఓ భక్తుడు సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలను తీసి తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడం స్థానికంగా కలకలం రేపింది. భక్తుడు తన సెల్‌ఫోన్‌తో ఫొటో తీయడం చర్చనీయాంశమైంది. సాధారణంగా భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ముందే సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి భక్తులను పంపాల్సి ఉంది. ఇదే క్రమంలో ఆలయ అలివేటి మండపం వద్ద భక్తులకు సెల్‌ఫోన్ కౌంటర్‌ను దేవస్థానం నిర్వహిస్తోంది. అయినా కామవరపుకోటకు చెందిన ఓ భక్తుడు సెల్‌ఫోన్‌ను లోపలకు తీసుకెళ్లడమే కాకుండా, ఫొటో తీసి తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. భద్రతా వైఫల్యం కారణంగానే అతను సెల్‌ఫోన్‌తో ఆలయంలోకి ప్రవేశించాడని భావిస్తున్నారు. ఈ ఘటనపై దేవదాయశాఖ అధికారులు, పాలకవర్గం ఏ చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

ఆర్టీసీ బంకు స్కామ్‌పై .. సమగ్ర విచారణ చేయాలి

- పోలీసు శాఖ నిర్ధారణ తర్వాతే చర్యలుండాలి
- ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ అధ్యక్షుడు దామోదరావు డిమాండ్

ఏలూరు,నవంబరు 21(ఆంధ్రజ్యోతి):'ఆర్టీసీ పెట్రోల్ బంకులో స్కామ్‌కు సంబంధం లేని ఉద్యోగులకు ఇచ్చిన సస్పెన్షన్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలి. అధికారులకు ఒక న్యాయం, ఉద్యోగులకు ఒక న్యాయం పాటించడం సమంజసంగా లేదు' అని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరావు ఆరోపించారు. నగరంలోని కపర్థీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ '2021లో ఏర్పాటైన ఈ బంకు నిర్వహణలో సరైన పర్యవేక్షణ లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై బాధ్యతలు ఉంచిన కారణంగానే రూ.83 లక్షలు అవకతవకలు జరిగాయని ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ధారించారు. వాస్తవాలను వెలుగుచూసేలా పోలీసులకు ఫిర్యాదు ఇచ్చి బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారుల జోక్యం చేసుకుని ఈ డబ్బులను సంబంధిత సెక్షన్‌లో పనిచేసే సిబ్బందితో పాటు నలుగురు జూనియర్ స్కేల్ అధికారులతో కలిసి మొత్తం తొమ్మిది మందితో రూ.50 లక్షలను కట్టించి వారిని తప్పించారు. డబ్బులు కట్టమని మరో నలుగురిని ఒత్తిడి చేయగా చేయని తప్పుకు డబ్బులు ఎందుకు కట్టాలని వారు ప్రశ్నించడంతో అన్యాయంగా ఆ నలుగురిని సస్పెండ్ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఎవరు తప్పు చేశారో పోలీస్ అధికారులు నిర్ధారించాకే బాధ్యులపై చర్యలుండాలి. లేకపోతే దీనిపై ఉద్యమిస్తాం' అని ఆయన స్పష్టం చేశారు.



గ్యారేజ్ వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ నాయకులు, సిబ్బంది

ఆర్టీసీ డిపో ముందు ధర్నా

అక్రమంగా నలుగురు ఉద్యోగులను బలి చేశారని, దోషులు ఎవరనేది తేల్చకుండా చర్యలు సరికాదని వ్యతిరేకిస్తూ ఏలూరు డిపో కార్యాలయం వద్ద వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈయూ ఏలూరు డిపో గౌరవాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులకు ఒక న్యాయం, కిందిస్థాయి ఉద్యోగులకు ఒక న్యాయం చేస్తున్నారని, బంకులో జరిగిన అక్రమాలపై జ్యుడిషియల్ ఎంక్వైరీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షను ఎత్తివేయక పోతే ఆందోళనలు ఉధృతం చేసామన్నారు. ఈయూ విజయవాడ జోన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, డిపో కార్యదర్శి డి.ఆంజనేయులు, స్టాఫ్ వర్కర్సు ఫెడరేషన్ డిపో కార్యదర్శి ఎ.రమేష్, టి.బాబూ రావు, పి.రాజు, బాబూరావు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల పుష్కరిణి వద్ద పోలి పూజలు చేస్తున్న మహిళలు

పోలి పాడ్యమి పూజలు

ద్వారకాతిరుమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుండెల నిండా భక్తిప్రపత్తులను నింపుకున్న మహిళలు కార్తీక దీపాలను కోనేరులో వదిలారు. కార్తీకమాసం ముగిసి, పోలిపాడ్యమిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున మహిళలంతా కలిసి కోనేరుల వద్ద చేసిన సందడి పండుగ వాతావరణాన్ని తలపించింది. ద్వారకాతిరుమలలోని శ్రీవారిపుష్కరిణిలో మహిళలు కార్తీక దీపాలను వదిలారు. ముందుగా కోనేరు వద్దకు చేరుకున్న వారంతా కార్తీకస్నాన స్నానాలను ఆచరించారు. అనంతరం కోనేరు మెట్లవద్ద పసుపు కుంకుమలతో పోలి అమ్మవారికి పూజలు జరిపారు. ఆ తర్వాత అరటి దొప్పలను తెప్పలుగా చేసి అందులో కార్తీక దీపాలను వెలిగించారు. వాటిని పుష్కరిణిలో వదిలి నమస్కరించారు. దీంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

శివాలయంలో శిఖర ప్రతిష్ఠ


కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో దాదాపు రూ.4.50కోట్లతో నిర్మించిన ఆలయ రాజగోపురం, దానిపై శిఖరప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు జరుగనున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, యాగశాల సంస్కారం, ప్రధాన దేవత ఆవాహన మండపారాధన తదితర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ యాగశాలలో గంగాపార్వతీ సమేత శివయ్య ఉత్సవమూర్తులను ఉంచి పూజలు చేశారు. అనంతరం దేవేరుల ముందు గోపురంపై ప్రతిష్ఠించాల్సిన కలశాలను ఉంచి పుష్పాలంకరణ చేశారు. అనంతరం వాటికి అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. ఆదివారం యంత్రస్థాపన ఉదయం గం.9.25లకు యంత్ర సహిత శిఖర ప్రతిష్ఠాపనలు, శ్రీమహాపూర్ణాహుతి హోమం ఆశీర్వచనం జరుగుతాయని ఈవో ఎస్వీ. సత్యనారాయణమూర్తి తెలిపారు.


అఘోరాల వేషధారణలో శివ స్వాములు నగర సంకీర్తన

శివమాలధారుల నగర సంకీర్తన

పెనుగొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):సిద్ధాంతం గ్రామంలో గురుస్వామి నక్కా సూర్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో 48 రోజులు శివ మాలలు ధరించి దీక్ష పూర్తి చేసుకున్న శివ భక్తులు శుక్రవారం అఘోరాల వేషధారణలతో హరహర మహాదేవ శంభో శంకర అంటూ నగర సంకీర్తన నిర్వహించారు. గ్రామ వీధులంతా శివనామస్మరణతో మారుమోగాయి. భక్తుల భజనలు, డప్పుల శబ్దాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. దీక్ష పూర్తి చేసుకున్న శివ స్వాములు శనివారం శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనార్థం బయలుదేరనున్నట్లు గురుస్వామి తెలిపారు.


సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సీజీఆర్ఎఫ్ శిబిరంలో 26 వినతులు

విద్యుత్ సమస్యలపై 1912కు ఫిర్యాదు చేయండి

సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ

ఆచంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచంటలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) శిబిరంలో 26 సమస్యలు ప్రజల నుంచి స్వీకరించినట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి. సత్యనారాయణ తెలిపారు. ఈ సంవత్సరం కాలంలో 1115 సమస్యలు నమోదు కాగా అందులో 920 సమస్యలను పరిష్కరించగా ఇంకా 190 సమస్యలు విచారణ కొనసాగుతున్నాయని తెలిపారు. 123 సమస్యలకు గాను రూ.15 లక్షల 87 వేల 400 రూపాయలు నష్ట పరిహారం ఇప్పించడం జరిగిందని తెలిపారు. సీజీఆర్ఎస్ పరిధిలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉంటుందన్నారు. అలాగే కాలేజీ విద్యార్థులకు గాను 128 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఉంటే 1912 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎస్. సుబ్బారావు, మురళీ కృష్ణ, ఏఈ కె. మధు కుమార్, జైనుల్లాహ్, బి.రామకృష్ణ పాల్గొన్నారు.


మొగల్తూరులో థియేటర్ రికార్డులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

మొగల్తూరులో థియేటర్ తనిఖీ

మొగల్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరులోని చెరుకూరి థియేటర్‌ను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. గతంలో శ్రీదేవి పికసీ థియేటర్‌గా ఉన్న ఈ థియేటర్‌ను మరొకరు ఇటీవల కొనుగోలు చేసి చెరుకూరి థియేటర్‌గా లైసెన్స్ మంజూరు చేయాలని కోరుతూ యజమానులు జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో జేసీ, తహసీల్దార్ కె.రాజ్ కిషోర్‌తో కలిసి ఆయన థియేటర్‌ను పరిశీలించేందుకు వచ్చారు. థియేటర్‌లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి నిబంధనల ప్రకారం 16 అగ్ని మాపక సిలిండర్లు ఉండాల్సి ఉండగా 8 ప్రాంతాల్లో మాత్రమే ఉన్నట్లు గుర్తించామని అన్నారు. టాయిలెట్లకు సంబంధించి పురుషులు, స్త్రీలకు తెలియజేసే బోర్డులు లేకపోవడం, అత్యవసర సమయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు అనుగుణంగా స్థానిక తహసీల్దార్, ఫైర్, పోలీస్ అధికారుల ఫోన్ నంబర్లు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. థియేటర్ ప్రాంగణంలో పార్కింగ్ సదుపాయం బాగుందని తాము సూచించిన విధంగా మరో మూడు రోజుల్లో ఏర్పాటు చేసి తమకు నివేదిస్తే అందిస్తే తహసీల్దార్ తనిఖీ చేసిన నివేదిక ఆధారంగా లైసెన్స్ మంజూరు చేస్తామన్నారు.

బాల్య వివాహాలు నివారిద్దాం

ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ



భీమవరం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ జీరో బాల్యవివాహాలు లక్ష్యంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. బాల్య వివాహాల నివారణపై విద్యాశాఖ కమిషనర్ విద్యాశాఖ అధికారులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు జారీ చేస్తూ సర్క్యులర్‌ను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో అప్రమత్తత చర్యలు, పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచనలు చేశారు. అందులో ప్రధాన చర్యలు ఇలా ఉన్నాయి.

జిల్లా స్థాయిలో..

జిల్లా స్థాయిలో డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు, ఎస్ఈవోల ప్రతినిధులతో జిల్లా చైల్డ్ మ్యారేజ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయవలసి ఉంటుంది. నెలనెలా సమీక్ష సమావేశాలు నిర్వహించుకుని వివరాలు సమీకరించుకోవలసి ఉంటుంది. అన్ని పాఠశాలల్లోను బాల్య వివాహ చట్టంపై పోస్టర్లు, హెల్ప్‌లైన్ నెంబర్లు ప్రదర్శించాలి.

మండల స్థాయిలో..

మండల స్థాయిలో ఎంఈవోలు, అంగన్‌వాడీ సిబ్బంది, పోలీసులు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయంతో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. బాల్య వివాహాలు జరిగే అవకాశాలున్న గ్రామాలను గుర్తించి మండల రిస్క్ లిస్ట్ తయారు చేయాలి. ప్రతి పాఠశాల నుంచి 15 రోజుల విద్యార్థుల హాజరు, రిస్క్ నివేదికలు తెలుసుకోవాలి.

> **హెల్ప్‌లైన్ నంబర్లు**
>
> ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే.. చైల్డ్ లైన్ 1098, 100లకు సమాచారం అందించాలి. ఎక్కడైనా బాల్యవివాహాలను గుర్తించినట్లయితే గంటలోపే సమాచారం అందించవలసి ఉంటుంది. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత బాధ్యులు తీవ్రంగా పరిగణించబడతారు.

పాఠశాల స్థాయిలో..

పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు రిస్క్ ఉన్న విద్యార్థుల గోప్య రిజిస్టర్ నిర్వహణ చేపట్టాలి. పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థి క్లబ్‌లు, ఎస్ఎమ్‌సీలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ఏదైనా అనుమానం వస్తే వెంటనే ఎంఈవో, పోలీసులకు సమాచారం అందించాలి. విద్యార్థుల హాజరు, పండుగలు, వేసవి సెలవులు, వివాహ సీజన్‌లో ప్రత్యేక పరిశీలన చేయవలసి ఉంటుంది.

ఉపాధ్యాయుల బాధ్యతలు..

పాఠశాలలోని ఉపాధ్యాయులు కూడా బాల్య వివాహాలు అరికట్టడంలో కొన్ని బాధ్యతలను అప్పగించే విధంగా సూచనలు చేశారు. విద్యార్థిని విద్యార్థుల హాజరు తగ్గడం, వారి ప్రవర్తనలో మార్పులు, నిశ్శబ్దం లాంటివి బాల్యవివాహాల సంకేతంగా గుర్తించాలి. వెంటనే అటువంటి విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులకు తెలియజేయవలసి ఉంటుంది. తరగతులలో చట్టాలు, హక్కులు, బాల్య వివాహాల ప్రమాదాలపై పాఠాలు, తల్లిదండ్రుల సమావేశాల్లో అవగాహన వంటివి కల్పించాలి.

కమ్యూనిటీ అవగాహన

గ్రామ, వార్డు స్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ డ్రైవ్ ప్రతి నెలా నిర్వహించాలి. పాఠశాల నోటీసు బోర్డులు, తరగతి గదుల్లో ఐఈసీ మెటీరియల్స్ పెట్టడం, బాలల హక్కుల వారోత్సవం, జాతీయ బాలిక దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుంది.

పీఆర్ 126పై నీలినీడలు!

సాగు చేయవద్దంటున్న వ్యవసాయాధికారులు

అధిక దిగుబడులు..సాగుకు రైతుల మొగ్గు



పెదవేగి/ఏలూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ వెరైటీ రకం పీఆర్ 126 వరి ప్రతికూల వాతావరణాన్ని తెగుళ్లను తట్టుకుంటుంది. అధికదిగుబడినిస్తుంది. మిగిలిన వాటికంటే త్వరగా కోతకొస్తుంది. దీంతో చాలామంది రైతులు రబీలోను పీఆర్ 126 రకం సాగుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ రకం ధాన్యం నాణ్యత తక్కువగా ఉంటుందని, గింజ ముక్కలుగా అవుతుందని, ఎగుమతికి అనుకూలంగా ఉండని ఈ రకం సాగుకు మొగ్గు చూపవద్దని మరోవైపు వ్యవసాయశాఖ చెబుతున్నారు.

ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, భీమడోలు, పెదవేగి మండలాల్లో ఖరీఫ్‌లో 951 ఎకరాల్లో ఈ పీఆర్ 126 రకం విత్తనం సాగు అయింది. రబీ సీజన్ నుంచి ఈ వరి రకాన్ని సాగు చేయకుండా ముందస్తుగానే చర్యలు చేపడుతున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇది రాష్ట్రీయ వరి వంగడం కాకపోవడంతో ప్రభుత్వం ఈ వరి రకానికి సబ్సిడీ ఇవ్వడం లేదని చెబుతున్నారు.వచ్చే రబీ సీజన్ నుంచి పీఆర్ 126 రకం పండించవద్దని జిల్లా వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇది మన ప్రాంతం రకం కాదని, దానికి ప్రత్యామ్నాయంగా ఉన్న ఎంటీయూ 1121 1282, 1293, 1426 రకాలను సాగు చేయాలని సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి పీఆర్ 126 రకం విత్తనం తీసుకువచ్చి సాగు చేశారని, ప్రస్తుతం పండించిన పంటను దాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేస్తారని చెబుతున్నారు. అయితే ఈ రకం పంటకు ఎగుమతులు లేకపోవడంతో సాగు చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పష్టతనివ్వాలి

పీఆర్ 126 రకం సాగుతో అధికంగా మెరుగైన ఆదాయం ఉంటుందని, తెగుళ్లను తట్టుకుని, తక్కువ సమయంలో కోతకు వస్తుందని రైతులు చెబుతున్నారు. అధికారులు ఈ రకం వంగడం ఎగుమతికి అనుకూలంగా లేదని, సాగు చేయవద్దని సూచిస్తున్నారని, ఈ విషయంలో పూర్తిస్థాయిలో స్పష్టత నివ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ రైతులతో కలిసి సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి అందించారు. ఖరీఫ్‌లో ఎక్కువశాతం మంది పీఆర్ 126 రకం సాగు చేశామని, రబీలో ఈ రకం సాగు వద్దని ఇప్పుడు చెబుతున్నారని, ఇప్పటికే విత్తనాలను సిద్ధం చేసుకున్నామని వాపోతున్నారు. ఇప్పటికిప్పుడు మరోరకం విత్తనాన్ని సేకరించడానికి సమయం సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **పీఆర్ 126 వద్దని సూచిస్తున్నాం**
>
> 'రబీలో పీఆర్ 126 రకం సాగు చేపట్టవద్దని రైతులకు సూచిస్తున్నాం. దిగుబడి పరంగా పీఆర్ 126 మిగిలిన వాటి కంటే మెరుగ్గా ఉంటుంది. ప్రతికూల వాతావరణంలోనూ తట్టుకుని నిలబడుతుంది. దీంతో రైతులు ఈ రకం సాగుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ రకం ధాన్యం ముక్కలు అయి ఎగుమతులకు అడ్డంకిగా మారుతోంది. ప్రత్యామ్నాయ వంగడాలపై రైతులు దృష్టి సారించాలి'
>
> - అనిల్‌కుమారి, వ్యవసాయశాఖ ఏలూరు సహాయ సంచాలకురాలు

రైతుల ఖుషీ

- ఖాతాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ములు
- విత్ డ్రాలతో రెండు రోజులుగా బ్యాంకుల వద్ద రద్దీ
- సొమ్ములు పడని రైతులు ఈకేవైసీ చేయించాలి



భీమవరం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు సరియైన సమయంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సొమ్ములు పడటంతో రైతులు ఖుషీగా ఉన్నారు. ఈ రెండు రోజుల్లో బ్యాంకుల్లో రైతుల రద్దీ కనిపించింది. రెండో విడతగా రైతుకు రూ.7 వేలు జమ అయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో లక్ష 3 వేల 761 మంది రైతులకు రూ.68 కోట్ల 97 లక్షల వారి ఖాతాల్లో దాదాపుగా అందరికీ జమ అయ్యాయి. కొంత మంది రైతులకు మాత్రం పీఎం కిసాన్ సొమ్ములు జమకాలేదు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోకపోవడంతో రైతు ఆధార్‌కి పట్టాదారు పాస్ బుక్ లింక్ చేయకపోవడం వల్ల సొమ్ములు పడటం లేదు. వీటిని పరిష్కరించుకునే మార్గాలు ఉన్నాయి. ఈకేవైసీ పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం వేలిముద్ర లేదా వరిస్ ఆవకాశం కల్పించింది. మీసేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్‌లో మాత్రమే ఈకేవైసీ చేసుకోవాలి. రైతు ఈకేవైసీ పూర్తి చేసుకున్న 30 రోజుల నుంచి 60 రోజుల్లో ఎన్‌పీసీఐ లింక్ ఉన్న బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ అవుతుంది.

పాస్ పుస్తకానికి ఆధార్ లింక్

పట్టాదార్ పాస్ పుస్తకాల్లో ఆధార్ లింక్ చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్ళాల్సి ఉంటుంది. డిజిటల్ అసిస్టెంట్ దగ్గర పాస్ పుస్తకానికి ఆధార్ లింక్ అప్లికేషన్ పూర్తి చేసి ఇవ్వాలి. రైతు వేలిముద్ర లేదా ఓటీపీ లింక్‌తో తహసీల్దార్ కార్యాలయానికి పంపించడం జరుగుతుంది. తదుపరి మండల వ్యవసాయ కార్యలయం నుంచి జిల్లా వ్యవసాయ కార్యాలయానికి వెళుతుంది. అప్పుడు లింక్ అవుతుంది.

బ్యాంక్ ఖాతా ఆధార్‌తో లింక్ కావాలి

రైతులకు ఉన్న బ్యాంకు ఖాతాలో ఆధార్‌తో అనుసంధానం కాకపోయినా పీఎం కిసాన్ సొమ్ములు జమ కావు. అందువల్ల రైతు విధిగా ఓపెన్ చేసిన బ్యాంకు వద్దకు వెళ్ళి ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలి. లేదా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ నందు కొత్త ఖాతా ఓపెన్ చేసినా ఎన్‌పీసీఐ లింక్ అవుతుంది. ఎన్‌పీసీఐ లింక్ అయ్యింది. 30 రోజుల నుంచి 90 రోజుల్లో వారికి నగదు జమ అవుతుంది.

నామినీ పేరు మార్చుకోవాలి

2019 ఫిబ్రవరి నెల తర్వాత పంట భూమి మ్యూటేషన్ జరిగిన వాటికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి అర్హత ఆవకాశం ఇవ్వలేదు. భర్త లేదా భార్య ఇద్దరిలో ఎవరో ఒకరికి ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతూ మరణిస్తే వారి నామినీ పేరు మార్చుకునే దరఖాస్తు చేస్తేనే అర్హులుగా గుర్తించబడతారు. ఒకే కుటుంబంలో ఇద్దరు లబ్ధిదారులు ఉంటే వెరిఫికేషన్ తర్వాత ఒక్కరే లబ్ధిదారు ఉంటే నగదు జమ చేస్తారు.

గుడ్డు అధరహో!

ఊపిరి పీల్చుకున్న పౌల్ట్రీ రైతులు..హోల్ సేల్ రూ.6.00.. రిటైల్‌గా రూ.6.50

గుడ్డు ధరలు భారీగా పెరిగాయి. నెల రోజులుగా గుడ్డు ధర పెరుగుతున్నది. గత నెల అక్టోబరు 12వ తేదీ నుంచి 4.80 పైసలు నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం వరుస నష్టాలు చవి చూస్తున్న రైతులకు పెరిగిన ధరలతో కాస్త ఉపశమనం లభించింది. చలి గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ఈశాన్య రాష్ట్రాల్లో గుడ్డు వినియోగం పెరిగింది. ప్రస్తుతం గుడ్డు ధర 6.00 రూపాయలుగా ఉన్నది. అదే రిటైల్ మార్కెట్‌లో 6.50 రూపాయలకు కూడా విక్రయిస్తున్నారు.



తణుకు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర గత వారంలో 5.70 పైసలు వరకు ధర పలికింది. గతంలో బర్డ్ ఫ్లూ వైరస్‌తో పాటు వేసవి కాలంలో అనేక ఇబ్బందులను పరిశ్రమ ఎదుర్కొంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టాలు చవి చూశారు. గత వేసవి కాలంలో గుడ్డు దిగుబడి తగ్గడంతో పాటు, కోళ్ల చనిపోవడం వల్ల పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలు పాలయ్యారు. ఇప్పుడు పరిస్థితి రైతుకు ఆశాజనకంగా ఉన్నది.

కోటి గుడ్ల ఉత్పత్తి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోళ్ళు 30లక్షల కోళ్ళు ఉన్నాయి. వాటిలో కోటి 10లక్షలు మాత్రమే గుడ్లు పెడతాయి. గతంలో పౌల్ట్రీకి ఉత్పత్తి పెరిగింది. గతంలో కేవలం 70నుంచి 75లక్షలు ఉత్పత్తి వస్తే ఇప్పుడు కోటి పది లక్షలు వరకు పెరిగింది. .

పెరిగిన ఎగుమతులు

గుడ్డు ఉత్పత్తికి అనుగుణంగా ఎగుమతులు బాగానే ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాల నుంచి 60 లారీలు వరకు ఎగుమతి అవుతుంటాయి. ప్రధానంగా బీహార్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు ఎగుమతులు అవుతుంటాయి. ఉత్పత్తి అయిన గుడ్లలో 75శాతం ఎగుమతులు పోగా మిగిలిన 25శాతం స్థానికంగా విక్రయాలు జరుగుతుంటాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 260 మంది వరకు రైతులు పరిశ్రమలో కొనసాగుతున్నారు.

> **నిలకడగా గుడ్డు ధర**
>
> 
>
> **వెంకట సుబ్బా రావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు**
>
> ప్రస్తుతం గుడ్డ ధరలు నిలకడగా ఉన్నాయి. ఈ ధరలు వల్ల రైతులకు ఉపశమనం కలుగుతుంది. వేసవి నుంచి చాలా రకాలుగా పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఇప్పుడు ధరలు కాస్త పెరిగాయి. ఈ ధరలు కొంత కాలం కొనసాగితే రైతులకు మరింత మేలు కలుగుతుంది.


పాములు ఉన్నాయని ఇంటిగోడపై రాసిన దృశ్యం

పాములున్నాయి జాగ్రత్త!

ఎక్కడైనా ఇంటి గేటు వద్ద కుక్కలు ఉన్నాయి జాగ్రత్త అని, కార్యాలయాల వద్ద, పొలాల వద్ద సీసీ కెమెరా నిఘా ఉంది జాగ్రత్త అని బోర్డులు చూసి ఉంటాం. భీమవరంలో కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళే దారిలో ఒక ఇంటి వద్ద పాములు ఉన్నాయి జాగ్రత్త అనే గోడపైన రాసి ఉండటంతో ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. జీఐడబ్ల్యుసీ కెనాల్ రోడ్డులో పాత రైస్ మిల్లు దాటిన వెంటనే పాడుబడిన చిన్న ఇల్లు ఉంటుంది. అక్కడ పిచ్చి మొక్కలు, కొబ్బరి చెట్లు, కొనలు అనేవి బోర్డు ఉంటుంది. దాని తోపాటు పాములు ఉన్నాయి జాగ్రత్త అనేది ఎందుకు రాశారో తెలియదు. ఐతే ఇంటి వెనుక అంతా గుబురుగా ఉంటుంది. దీంతో అక్కడ పాముల సంచారం ఎక్కువగా ఉండటంతో ప్రజలను అప్రమత్తం చెయ్యటం కోసం రాశారేరేమో ముందు జాగ్రత్తగా రాశారో తెలియదు.

- భీమవరం టౌన్, ఆంధ్రజ్యోతి

తేగలకు ధరాఘాతం



తణుకు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధంగా గ్రామీణ ప్రాంతాల్లో లభించే తేగల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, రైతు కూలీలు ఎటువంటి తెలిపెట్టకుండా తాటికాయలను పాతరగా వేసుకుని తేగలు పండించుకునే వారు. కాలక్రమంలో పంట పొలాలు ఇతర అవసరాలకు వినియోగించడం పెరిగిపోవడంతో పొలాల్లో పండే తాటి చెట్లను తొలగించడం, ఉన్న చెట్లకు కాసే కాయలను కొంత మంది జర్రపల్లి పాతరలు వేయడంతో తేగలకు ధర ఏర్పడింది. ఎన్నో పోషకాలు ఉన్న తేగల వినియోగం కూడా పెరిగింది. దీనితో ఏటా తేగల ధరలు పెరిగిపోతూ వస్తుంది. ఇప్పటి వరకు తేగలు వ్యాపారులు రూ.50, రూ. 100 వరకు గ్రేడ్ వారీగా అమ్మకాలు చేసేవారు. ఈ సంవత్సరం ఈ గ్రేడ్లు మారి రూ. 50లు, రూ. 100తో పాటు కొత్తగా రూ. 150, రూ. 200లకు కూడా తేగల కట్టలు కట్టి అమ్ముతున్నారు. ఒక్కో కట్టకు 10 నుంచి 12 తేగలు ఉంటాయి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో చవకగా లభించే తేగలు ఇప్పుడు ఖరీదు పెట్టి కొనుగోలు చేయవలసి వస్తుందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక దశలోనే కంటి లోపాలు గుర్తించాలి


కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంటి చూపును కోల్పోతే ప్రపంచాన్ని ఏమీ చూడలేమని ప్రపంచంలో ఉండే విశేషాలను గ్రహించలేరని సర్వేంద్రియానాం నయనం ప్రధానమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. తానా సతీష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరు అమీనాపేటలో ఉన్న సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులకు నేత్ర సంరక్షణ వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేయగా ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలకు కంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ కంట్లో ఉన్న లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు పొందాలన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ 8వ తరగతిలో తన కంటి చూపు మసకబారిందని గుర్తించి కళ్ళజోడు వాడకపోవడంతో కంటి అద్దాలు వేసుకోవడంతో ఆ తరువాత ప్రపంచాన్ని చక్కగా చూడగలిగానన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని అన్నారు. అడిషనల్ ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, తానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఏలూరు టీమ్ ఆర్గనైజర్ మారగాని చంద్రకిరణ్, కమిటీ సభ్యులు రాజనాల సాయికిరణ్, ప్రవీణ్, రాజనాల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఒఎస్‌డీ సుగుణ

రైతులకు ఆధునిక పద్ధతులు పాటించాలి

నరసాపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి సాగు చేయాలని ఆక్వా యూనివర్సిటీ ఓఎస్‌డీ సుగుణ అన్నారు. లక్ష్మణేశ్వరం ఆక్వా కాలేజీలో మూడు రోజులుగా జరుగుతున్న రొయ్యల సాగు శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. సదస్సులో పాల్గొన్న రైతులకు ఆమె సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది రైతులు సరైన అవగాహన లేకపోవడం వల్ల యాంటిబయోటిక్ మందులు అధికంగా వాడుతున్నారన్నారు. దీని వల్ల లాభం కన్నా.. నష్టాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ల్యాబ్ పరీక్షలు, రొయ్య చెరువుల ఎంపిక కీలకమన్నారు. శాస్త్రవేత్తల సూచనలు అనుగుణంగా రైతులు సాగు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీన్ డి.మాధవి, వీరభద్రరావు, శ్రావణి పాల్గొన్నారు.

గ్రామ/వార్డు సచివాలయాల్లో స్పౌజ్ కోటాలో ఉద్యోగుల బదిలీ

- ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి
- అంతర్‌జిల్లాల బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- ఈనెల 30వ తేదీలోగా బదిలీ ప్రక్రియ పూర్తి

ఏలూరుసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ/వార్డు సచివాలయాల్లో స్పౌజ్ కోటాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అర్హులైన ఉద్యోగులు శుక్రవారం నుంచి ఈనెల 24 వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అంతర జిల్లాల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఉద్యోగుల ఖాళీల వివరాలను ప్రకటించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వారీగా పోస్టుల ఖాళీ వివరాలు పరిశీలిస్తే ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం 500 వరకు పోస్టులు ఖాళీగా వున్నాయని తెలిసింది. ఇందులో ఇప్పటివరకు వివిధ శాఖల వారీగా వచ్చిన వివరాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 171, అగ్రికల్చర్ అసిస్టెంట్లు 2, వెల్ఫేర్ అసిస్టెంట్లు 82, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లు 2, మహిళా పోలీస్‌లు 194, ఫిషరీస్ అసిస్టెంట్లు 11, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలు 38 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), మున్సిపల్ కమిషనర్లు ఈనెల 24వ తేదీన దరఖాస్తులను ప్రాసెస్ చేయటం జరుగుతుంది. ఈనెల 25, 26 వ తేదీల మధ్య దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి, అభ్యర్థుల తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తారు. తుది జాబితాలను ఈనెల 26వ తేదీనే జిల్లా కలెక్టర్ పరిశీలించి రాష్ట్ర స్థాయిలోని శాఖాధిపతులకు పంపటం జరుగుతుంది. ఆ దరఖాస్తులను సంబంధిత శాఖాధికారులు రాష్ట్ర స్థాయిలో పరిశీలించి ఈనెల 27, 28 తేదీలలో ప్రభుత్వానికి నివేదించటం జరుగుతుంది. ఈనెల 29న ఉద్యోగుల బదిలీలకు సంబంధించి తుది జాబితాను ప్రకటిస్తారు. ఏమైనా అభ్యంతరాలు వస్తే ఈనెల 30వ తేదీన పరిష్కరిస్తారు. ఈ రకంగా గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న స్పౌజ్ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కొనసాగనుంది. అంతర్‌జిల్లాల బదిలీ ప్రక్రియ కావటంతో స్పౌజ్ కోటాలో ఉద్యోగులు ఉమ్మడి జిల్లాల వారీగా ఒక జిల్లానుంచి వేరే జిల్లాకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

నూజివీడులో బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న డీఈవో

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలు నూజివీడులోని బెతస్తా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఏలూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా విద్యాశాఖా ధికారిణి ఎం. వెంకట లక్ష్మమ్మ, ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల్లో రాణించి పాఠశాలకు తద్వారా జిల్లాకు మంచిపేరు తేవాలని కోరారు. తొలుత గుంటూరు, విజయనగరం జట్ల మధ్య సాగగా విజయనగరంపై 38-04 తో గుంటూరు విజయం సాధించింది. అనంతరం పశ్చిమ గోదావరిపై చిత్తూరు 19-30 స్కోర్‌తో విజయం సాధింగా తూర్పు గోదావరి, శ్రీకాకుళంపై 31-02 స్కోర్‌తో విజయం సాధించింది. ఇక అనంతపురం-ప్రకాశం జట్ల మధ్య పోటీ ఏకపక్షంగా సాగి 15-0 స్కోర్‌తో అనంతపురం విజయం సాధించింది. కృష్ణా, వైఎస్సార్ కడప మధ్య సాగిన పోటీలో 15-03 స్కోర్‌తో కృష్ణా జట్టు విజయం సాధించింది. ఇక బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఈస్ట్ గోదావరి శ్రీకాకుళంపై 30-03 స్కోర్‌తో విజయం సాధించగా, వైజాగ్‌పై చిత్తూరు 30-33 స్కోర్‌తో నెల్లూరు వైఎస్సార్ కడపపై 22-10 స్కోర్‌తో, వెస్ట్ గోదావరి విజయనగరంపై 27 - 0 స్కోర్‌తో, కృష్ణా, ప్రకాశంపై 33 - 05 స్కోర్‌తో విజయకేతనం ఎగురవేశాయి.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు సహిష్ట


విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్

పెదవేగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల విద్యార్థి సహిష్ట అమిన్ సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 19వ తేదీన ఏలూరు ఆశ్రం కళాశాలలో నిర్వహించిన పోటీల్లో దంతవైద్య కళాశాల విద్యార్థిని సహిష్ట అమిన్ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైందని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు. ఈ సందర్భంగా దంతవైద్య కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. సౌజ్‌జోన్ వాలీబాల్ పోటీలు తమిళనాడు రాష్ట్రంలో డిసెంబరు 15వ తేదీ నుంచి 19 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్లీవరాజు, పీడీ ఎస్.నల్లయ్య అభినందించారు.

జాతీయ యోగా పోటీలకు చంద్రశేఖర్


చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న దృశ్య

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మోదుగగుంట పీడీ బడుగు చంద్రశేఖర్ ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి యో గా పోటీలలో రాష్ట్రం తరపున ఆయన ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈవో వి.హనుమ, ఎంపీడీవో చంద్రశేఖర్, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

అథ్లెటిక్స్ లీగ్ పోటీలు

తణుకు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అస్మిత అండర్-14, 17 బాలికల అథ్లెటిక్స్ లీగ్ పోటీలు తణుకులోని బాలురున్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ చెప్పారు. అండర్-14 బాలికల పోటీలు హెచ్ఎం పద్మావతి ప్రారంభించారు. అండర్-17 బాలికల పోటీలు అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. సత్యనారాయణ ప్రారంభించారు. సంఘ కోశాధికారి బాబురావు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరవ్వగా 33మంది విజేతలుగా నిలిచారని వివరించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.ఎం నాగరాజ్యం, రజిని, అనంతలక్ష్మి, విజయదుర్గ, స్వరూప పర్యవేక్షించారు

షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం



ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒక హోటల్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి హోటల్ దగ్ధమైంది. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో సాయిబాబా వెజిటేరియన్ హోటల్‌ను కేతవరపు కేదారేశ్వరరావు నిర్వహిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో హోటల్‌లో మూడున్నర లక్షల విలువైన సామగ్రి, ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న ఏలూరు ఫైర్‌ఇంజన్లు అక్కడికి వెళ్ళి మంటలను చుట్టుపక్కల భవనాలకు అంటుకోకుండా కాపాడారు.



ఆహ్లాద తీరం... విషాదాల పర్వం

- సూసైడ్ స్పాట్‌గా చించినాడ బ్రిడ్జి..
- క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్న వైనం
- పలు ఘటనల్లో లభించని ఆచూకీ
- పోలీసు పర్యవేక్షణ.. ఫెన్సింగ్ ఏర్పాటుకు వినతి



గల్లంతైనవారి ఆచూకీకోసం గోదావరిలో గాలింపు.. బ్రిడ్జిపై తచ్చాడుతున్న యువతికి పోలీసుల కౌన్సెలింగ్(ఫైల్)

(యలమంచిలి-ఆంధ్రజ్యోతి)

చించినాడ బ్రిడ్జి వద్ద ఏడాది పొడవునా, నిత్యం గోదావరిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఈ ప్రాంతంలో నదిలో లోతు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ ఎవరైనా పడితే వెంటనే గల్లంతవుతున్నారు. ఆత్మహత్యకు పాల్పడే వారు చించి నాడ వారధిపై వదిలివేసిన ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రి ఆధారంగా వివరాలు తెలుసుకోవాల్సి వస్తోంది. ఇలాంటి విషాదకర ఘటన లు తరచుగా జరుగుతుండటంతో బ్రిడ్జిపై ఎవరూ లేకుండా వాహనం లేదా ఇతర వస్తువులు కనపడితే ఎలాంటి విషాదకర వార్త వినాల్సి వస్తుం దోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గల్లంతైన వారి ఆచూ కీ కోసం వివిధ శాఖల అధికా రులు గాలింపు చర్యలు చేపడుతున్నా.. కొన్ని సందర్భాల్లో గుర్తుపట్టని స్థితికి చేరిన తరువాతగానీ మృతదేహాలు దొరకడంలేదు. గోదావరిలో వేటకు వెళ్లిన మత్స్యకారులు, స్థానికులు, పోలీసులు గమనించి తక్ష ణం స్పందించి దూకిన వారిని రక్షించిన ఘటనలు చాలా ఉన్నా యి. అంతేకాక ఒంట రిగా, ఆందోళనతో బ్రిడ్జిపై తచ్చాడుతున్న వారిని పోలీసులు, స్థానికులు గుర్తించి వారికి నచ్చచెప్పి, కౌన్సెలింగ్ ఇచ్చి వారి కుటుంబీకులకు అప్పగించిన సందర్భాలు అనేకం.

ఏడేళ్లలో 53 మంది..

2019 నుంచి 2025వ సంవత్సరంలో ఇప్పటివరకూ ఏడేళ్లలో ఉభయగోదావరి జిల్లాలకు చెందిన మొత్తం 53 మంది ఈ వారధిపై నుంచి గోదావరిలో దూకి ప్రాణాలు పోగొట్టుకున్నారని పోలీసులు చెబు తున్నారు. పోలీసు రికార్డుల ప్రకారం 2019వ సంవత్సరంలో ముగ్గురు, 2020లో నలుగురు, 2021లో 17 మంది, 2022లో అయిదుగురు, 2023లో అయిదుగురు, 2024లో ఏడుగురు, 2025వ సంవత్సరంలో ఇప్పటివరకూ 12 మంది గోదావరిలో దూకి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

అత్యంత విషాదకర ఘటనలు..

- 2021లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన భార్యాభర్తలు, వారి కుమారుడు, కుమార్తెలతో కలిసి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్యంత విషాదకరం. వీరి ఆచూకీ కోసం గోదావరిలో సుమారు వారం రోజులపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గాలించగా భార్యాభర్తలు, కుమార్తె మృతదేహాలు లభ్యం కాగా.. కుమారుడి ఆచూకీ లభించకపోవడం వారి బంధువులను కలచివేసింది.
- ఈ నెల 17వ తేదీ రాత్రి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా లక్కవరం గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు, కుమార్తె చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికులను, వారి బంధువులను కలచివేసింది.

గాలింపు కత్తిమీద సామే..

గోదావరి ఉధృతంగా ప్రవహించే జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఇలాంటి సంఘటనలు జరిగాయి. ఈ నేపథ్యంలో గల్లంతైన వారి ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది గోదావరిలో గాలింపు చర్యలు చేప ట్టడం కత్తిమీద సాములాంటిదని... వరద ఉధృతిలో గాలించడం ప్రాణాల మీదకు తెచ్చుకోవడమేనని పలువురు స్థానికులు, మత్స్యకారులు పేర్కొంటున్నారు.

రక్షించిన సందర్భాలనేకం..

గత నెల 23వ తేదీన భీమవరానికి చెందిన మహిళ బ్రిడ్జిపై అనుమానాస్పదంగా తచ్చాడుతుం డటంతో బ్రిడ్జిపై హైవే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న హోం గార్డు శ్రీనివాస్ ఆమెను నిలువరించారు. గోదావరిలో ఆత్మహత్యాయత్నం చేస్తున్న సమయాల్లో చూసిన జాలర్లు, దిండి రిసార్ట్స్ బోట్ సిబ్బంది వారిని రక్షించిన సందర్భాలనేకం.

పర్యవేక్షణతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే మేలు..

చించినాడ బ్రిడ్జి రెయిలింగ్‌కు ఎత్తైన ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తే బ్రిడ్జిపై ఆత్మహత్యలను నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. బ్రిడ్జిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో బ్రిడ్జిపై నిరంతరం పోలీసు పర్యవేక్షణ ఉండేలా ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలను నివారించ వచ్చని మరికొందరు సూచిస్తున్నారు. ఈ ప్రదేశంలో ఆత్మహత్యలను నివారించేందుకు ప్రభుత్వం దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి గ్రామానికి గోదావరి జలాలు : ఆరిమిల్లి


దువ్వలో వీధులను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తణుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి శుద్ధిచేసిన గోదావరి జలాలను తాగునీరుగా అందించేందుకు రూ. 54 కోట్లతో పైప్ నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం దువ్వలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడుతూ తణుకు నియోజకవర్గ ప్రజలకు గోదావరి జలాలను అందించేందుకు ధవళేశ్వరం నుంచి 154 కిలో మీటర్ల మేర పైప్ లైన్ నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 48 గ్రామాలకు గోదావరి జలాలను అందిస్తామని చెప్పారు. పైప్‌లైన్ పనులతో పాటు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్ర మంలో బాగంగా గ్రామాల్లో పూర్తి స్థాయి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆరిమిల్లి చెప్పారు. శుక్రవారం దువ్వలో సూపర్ శానిటేషన్ కార్యక్రమంలో ఆయన చీపురు పట్టి వీధులు శుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దువ్వలో రూ. 43 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని శుక్రవారం ఆరిమిల్లి ప్రారం భించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తణు కు నియోజకవర్గంలో రూ. 1650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీపీ రుద్ర ధనరాజు, ఏఎంసీ ఛైర్మన్ శివ, వైస్ ఛైర్మన్ వల్లూరి రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షు డు ఆత్మకూరి రామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు మైపాల నాగేశ్వరరావు, దానేశ్వరి ఆలయ ఛైర్మన్ పత్తి రామకృష్ణ,, సొసైటీ ఛైర్మన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న న్యాయమూర్తి డాక్టర్ లక్ష్మీనారాయణ

భీమవరం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం గొప్పతనం విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో స్కూల్, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, న్యాయ కళాశాలల విద్యార్థులకు 'భారత రాజ్యాంగం- సామాజిక బాధ్యత' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు భీమవరం మూడవ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. పాల్గొన్న విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26న విష్ణు ఇంజనీరింగ్ కాలేజీలో మెమెంటో, సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల గురించి, డిసెంబర్ 13 జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి తీసుకుంటున్న చర్యలపై శుక్రవారం న్యాయమూర్తి పత్రికా సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ 'డిసెంబర్ 13న భీమవరంలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఇప్పటికే న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశాలు పెట్టామని, కోర్టుల్లో తీర్పు వస్తే ఒకరు మాత్రమే నెగ్గుతారు, అదే జాతీయ లోక్ అదాలత్‌లో సుహృద్భావ వాతావరణంలో రాజీ చేసుకుంటే ఇరుపార్టీలు నెగ్గినట్లేనని అన్నారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీష, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రైలు గేట్ వేస్తున్నారన్న హడావుడిలో..

- రెండు మోటార్ సైకిళ్లు ఢీ.. యువకుడి దుర్మరణం

మండవల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చావలిపాడులో శుక్రవారం రైల్వేగేటు వద్ద రెండు మోటారు సైకిళ్లు ఢీకొని యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. కైకలూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ తలారి వెంకటస్వామి, కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన పడమటి సత్యనారాయణ(25) కైకలూరు నుంచి మండవల్లి వైపు వస్తున్నారు. రైలు గేటు వేస్తున్నారని ఇద్దరూ వేగంగా మోటారు సైకిళ్లు నడుపుతూ ఒకదానికొకటి ఢీకొనడంతో కిందపడిపోయారు. సత్యనారాయణ తలకు తీవ్ర గాయాలవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటస్వామికి తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

భీమవరం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విసుగు చెంది మనస్తాపంతో ఓ మహిళ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం టూటౌన్ స్టేషన్ రైటర్ భూషణం తెలిపిన వివరాలివి.. స్థానిక బలుసుమూడికి చెందిన బొద్దూరి సత్యనారాయణ ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. అతడికి వున్న ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. చిన్నకుమార్తె బొద్దూరి అపర్ణ (36)కు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె హైదరాబాద్‌లో ఉండేది. మూడు రోజుల క్రితం పిల్లలను తీసుకుని భీమవరంలోని తండ్రి ఇంటికి వచ్చింది. ఈనెల 20వ తేదీ సాయంత్రం బాత్‌రూమ్‌లోకి వెళ్లి వీడియో తీసుకుని జీవితం పట్ల విసుగు చెందిందని, మానసిక వేదన కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు తండ్రికి పంపించి గడ్డి మందు తాగింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను భీమవరంలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆసుపత్రి సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ భూషణం తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరులోని సీఆర్‌ఆర్ డిగ్రీ కాలేజీ దగ్గరలోని రైల్వే లోబ్రిడ్జి సమీపంలో డ్రైవాష్ నిర్వహిస్తున్న గంటా వెంకటేశ్వరరావు (38)కి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 19న ఇంటివద్దే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్సకు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

తెలంగాణ మద్యం కలిగిన ఒకరి అరెస్ట్

తణుకు, నవంబరు21(ఆంధ్రజ్యోతి) : విదేశీ, డిఫెన్స్, తెలంగాణ మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మూడో వార్డులో టి.వేమవరం రోడ్డులో నివాసం ఉంటున్న సకినాల వెంకట దుర్గతాతేశ్వరరావు అనుమతులు లేకుండా విదేశీ మద్యం, డిఫెన్స్ మద్యం, తెలంగాణ మద్యం కలిగి ఉండడంతో అరెస్టు చేశామన్నారు. అతడి వద్ద నుంచి 6.75 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పండ్ల వ్యాపారం చేస్తూ, హైదరాబాదు నుంచి మద్యం బాటిళ్లను తీసుకొచ్చి తణుకులో అధిక ధరకు విక్రయిస్తున్నారనే సమాచారంపై అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. దాడులలో ఎస్‌ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, హెచ్‌సీ శ్రీనివాసు, కానిస్టేబుల్ గంగాధర్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

పాఠశాల వద్ద పీడీఎస్‌యూ, కేవీపీఎస్, మృతురాలి బంధువుల ఆందోళన



కావ్య మృతదేహం.. సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :జంగారెడ్డి గూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పొడపాటి కావ్య(15) శుక్రవారం మధ్యాహ్నం తరగతి గదిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలివి.. జంగారెడ్డిగూడెం మండలంలోని జొన్నవారిగూడెంకు చెందిన పొడపాటి గంగా ధరరావు, ఉషారాణి దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. మృతురాలు కావ్య పెద్ద కుమార్తె. ఆమె ఐదో తరగతి నుంచి నుంచి స్థానిక గురుకుల పాఠశాల హాస్టల్‌లోనే చదువుతోంది. రెండో కుమార్తె సౌమ్య అదే గురుకుల పాఠశాలలో ఆరో తరగతి, మూడో కుమార్తె మోక్ష స్వగ్రామంలోనే నాలుగో తరగతి చదువుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామంలో తన తోటి విద్యార్థినులంతా భోజనానికి వెళ్లగా కావ్య తర్వాత వస్తానని చెప్పి.. ప్రతిరోజూ తాను కూర్చునే బెంచీపైకి ఎక్కి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆమె ఇంకా భోజనానికి రాకపోవడంతో ఆమె స్నేహితులను మెస్ ఇన్‌చార్జి తీసుకురమ్మని పంపించడంతో తరగతిగది వద్దకు వారు వెళ్లగా ఫ్యాన్‌కు వేలాడుతున్న కావ్యను చూసి భయంతో కేకలు వేశారు. ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ సెక్యూరిటీ సిబ్బంది సాయంతో కిందకు దింపి అంబులెన్సులో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సీఐ ఎంవీ సుభాష్, ఎస్ఐ ఎన్‌వీ.ప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రిన్సిపాల్ గంగాభవానీతో పాటు మహిళా ఉపాధ్యాయులను, కావ్య స్నేహితులను విచారించారు. బాలిక తల్లి ఉషారాణి కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోందని, నిత్యం డయాలసిస్‌తో ఇబ్బంది పడుతుండగా ఆ బాధను చూడలేక చదువు మానేయాలని ఉందని పలుసార్లు చెప్పి బాధపడిందని స్నేహితులు తెలిపారు. సీఐ మాట్లాడుతూ తరగతి గదిలోని సీసీ ఫుటేజీ రికార్డులు పరిశీలించామని, డాగ్ స్క్వాడ్, వేలిముద్రల నిపుణులచే అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామన్నారు. మరోవైపు బాలిక కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, కేవీపీఎస్‌తోపాటు మృతురాలి బంధువులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు.

విద్యుత్ వైర్ల రాపిడితో కిందపడిన నిప్పు రవ్వలు

- దగ్ధమైన 37 ఎకరాల వరి గడ్డి.. ఆరు ఎకరాల వరి చేను

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరి చేలు మీదుగా ఉన్న విద్యుత్ వైర్లు గాలికి ఒకదానికి ఒకటి తగిలి నిప్పురవ్వలు పడడంతో ఆ పొలంలో అగ్ని ప్రమాదం సంబవించి, నలుగురు రైతులకు భారీ నష్టం జరిగింది. ఏలూరు సమీపంలోని వట్లూరు దగ్గరలో కొమ్మన లక్ష్మీమోహన్ 25 ఎకరాలు, కొమ్మన మురళీకృష్ణకు 12 ఎకరాలు ఉండడంతో వరి చేను కోశారు. ఆ పొలంలో గడ్డి ఉండిపోయింది. ఆ పొలం మీదుగా విద్యుత్ స్తంభాలు, వైర్లు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం గాలికి విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తగిలి నిప్పు రవ్వలు కిందపడి కొమ్మన లక్ష్మీమోహన్ పొలంలోని ఎండుగడ్డిపై పడడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ మంటలు పక్కనే ఉన్న కొమ్మన మురళీకృష్ణ అనే రైతుకు చెందిన 12 ఎకరాల్లోని వరి గడ్డి దగ్ధమైంది. ఆ మంటలు పక్కనే వరి కోతకోయని జొన్నలగడ్డ నాగరాజుకు చెందిన రెండు ఎకరాలు, నెర్సు ఏడుకొండలు అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాలు దగ్ధమయ్యాయి. సుమారు 10 లక్షల నష్టం వాటిల్లినట్లుగా భావిస్తున్నారు.

పోస్టుమాస్టర్‌పై కేసు నమోదు

పెదవేగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డిపాజిట్ సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమచేయకుండా కాజేసిన పోస్టు మాస్టర్‌పై కేసు నమోదు చేశామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. వేగివాడలోని బ్రాంచి పోస్టాఫీసు పోస్టుమాస్టర్‌గా గతంలో పనిచేసిన తాడిచర్ల గ్రామానికి చెందిన తోట నాగరాజు ప్రజలు కట్టిన డిపాజిట్ సొమ్ములు మొత్తం రూ.7,07,668 సొంత అవసరాలకు వినియోగించాడు. దీనిపై బాధితులు గతంలో పోస్టల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోస్టల్ శాఖ చర్యలతో దుర్వినియోగం చేసిన సొమ్ములో రూ.6లక్షలు రికవరీ చేశారు. మిగిలిన సొమ్ము తిరిగి చెల్లించలేదు. ఈమేరకు పోస్టల్‌శాఖ ఏలూరు ఇన్‌స్పెక్టర్ డి.శ్రీకాంత్ పెదవేగి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో నిందితుడు నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.


'మనోబంధు' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏలూరు జిల్ల ఎస్పీ కిశోర్

మనోబంధు, రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

ఏలూరు క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):మతి స్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి వారికి ఆశ్రయం కల్పించి వైద్య సహాయం అందేలా ఏర్పాటు చేస్తున్న మనోబంధు ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ అన్నారు. శుక్రవారం ఏలూరులో మనోబంధు ఫౌండేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు జిల్లాలో పోలీస్‌శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్సీ మాట్లాడుతూ గతనెల అక్టోబరు 23 నుంచి మతిస్థిమితం కోల్పోయి, రోడ్లపక్కల తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి ఆశ్రయం కల్పించి, వారికి విశాఖ పట్టణంలో వైద్య సహాయం అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్సీ తెలిపారు. ఇటువంటి వారు ఎవరైనా కనిపిస్తే 92465 63738 నంబరుకు తెలియజేయాలన్నారు. మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు బి.సురేష్ ఈ.సత్యసాయికిరణ్, నారాయణ, రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని కాపాడిన వైద్యుడు


కాలు తొలగించి ప్రాణాలు కాపాడిన డాక్టర్ చిన్నికృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలతో ప్రాణాపాయస్థితిలో ఉన్న క్షతగాత్రుడికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన ఘటన తాడేపల్లిగూడెంలో జరిగింది. పెంటపాడు మండలం రాచర్లలో లారీ ఢీకొట్టడంతో అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకు కాలు నుజ్జు నుజ్జయింది. తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనలతో స్థానిక కూటమి నాయకులు అతడిని తాడేపల్లిగూడెం సాయివెన్నెల ఆసుపత్రికి తరలించి, మూడు ప్యాకెట్ల రక్తం ఎక్కించారు. అనంతరం డాక్టర్ చిన్నికృష్ణకుమార్ మోకాలు కింద వరకు కాలు తొలగించడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

టిప్పర్ లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


టిప్పర్‌లారీ బైక్‌ను ఢీకొన్న దృశ్యం

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని అతివేగంగా టిప్పర్ లారీ ఢీకొనడంతో ఆ వ్యక్తి చేయి నుజ్జునుజ్జు అయిపోయింది. ముసునూరు మండలం మడిచర్లకు చెందిన కాటూరి ముత్త య్య(45) తన కుమార్తెను కాలేజీలో దించేందకు వచ్చి తిరిగి వెళుతుండగా పాతబస్టాండ్ వద్ద అతివేగంగా ఫైర్‌స్టేషన్ వైపు నుంచి వచ్చిన టిప్పర్ లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్ నుజ్జునుజ్జు కాగా, అతడి కుడి చేయి నుజ్జునుజ్జయింది. అక్కడ ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. ఈ ఘటనపై ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

'యువతలో మానసిక ఆరోగ్యం'పై అవగాహన

పెదపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ, స్మార్ట్ ప్రొఫెషనల్ లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో 'యువతలో మానసిక ఆరోగ్యం' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. న్యూరో సైక్రియాటిస్ట్ డాక్టరు కె.ఆనంద్ మాట్లాడుతూ మనం ఎదుర్కొనే శారీరక ఆరోగ్యం ఒక్కటే సంపూర్ణ ఆరోగ్యం కాదని, మానసిక ఆరోగ్యం కలిస్తేనే సంపూర్ణ ఆరోగ్యమన్నారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్, కిలారు ప్రభాకరరావు, సరళ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన మొక్కజొన్న రైతుల దీక్షలు

ద్వారకాతిరుమల , నవంబరు21(ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న విత్తన పంట బకాయిల కోసం పంగిడిగూడెం శివారు హనుమాన్‌గూడెంలో ఆర్గనైజర్ చేతిలో మోసపోయిన రైతుల దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టి భాస్కరరావు, కార్యదర్శి కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి గుర్రం రాంబాబు మాట్లాడుతూ రైతుల్ని మోసం చేసిన ఆర్గనైజర్‌పై చీటింగ్ కేసు నమోదు చేయాలని, బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రేపు మేడల్లో తూర్పువీధి అమ్మవార్ల ప్రతిష్ఠ


మాట్లాడుతున్న జాతర కమిటీ కన్వీనర్ భానుప్రకాశ్

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు తూర్పువీధి గంగానమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల కొలుపులు, జాతర మహోత్సవాల్లో భాగంగా ఈనెల 23వ తేదీన అమ్మవార్లను ప్రతిష్ఠింపజేస్తామని జాతర కమిటీ కన్వీనర్ వంకినేని భానుప్రకాశ్ తెలిపారు. రైల్వే చెరువు వద్ద ఘట ఆవాహన చేసి పొలిమేర్ల వద్ద నుంచి ఆహ్వానించి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి మూడు రాత్రులు, నాలుగు పగళ్లు సంచారం చేయించి దేవస్థానం మేడల్లో ప్రతిష్ఠింప చేస్తామన్నారు.తూర్పువీధి జాతర పరిధిలో ప్రతీ ఇంటి వద్ద జెండాలు, స్టిక్కర్లు ఏర్పాట్లు చేస్తామని ఈ ప్రక్రియను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆలయం వద్ద శుక్రవారం ప్రారంభించారని భానుప్రకాష్ తెలిపారు. జాతర కమిటీ సభ్యులతో పాటు మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు, మాజీ ఎంపీటీసీ మాకాల రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం : బాలరాజు


ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్

జీలుగుమిల్లి, నవంబరు 21 :(ఆంధ్రజ్యోతి) :ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.4.97కోట్లు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశామన్నారు. నియోజకవర్గంలో ప్రతీ మంగళవారం మండల స్థాయి జనవాణి కార్యక్రమం నిర్వహించాలని పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారన్నారు. జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, నాయకులు పద్దం వెంకటకృష్ణ, కొర్స దుర్గారావు, తమ్మన సాంబ ఉన్నారు. గత పదిహేనేళ్లుగా గిరిజన గ్రామాల్లో సీహెచ్‌డబ్ల్యూగా పనిచేస్తున్న వారిని ఆశావర్కర్లుగా గుర్తించాలని, హెల్త్ అసిస్టెంట్, లేబ్ టెక్నీషియన్‌ల పోస్టులు భర్తీ చేయాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

చింతలపూడి-టి.నరసాపురం రోడ్డుకు భూమి పూజ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


టి.నరసాపురం రోడ్డుకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'చింతలపూడి- టి.నరసాపురం రోడ్డు నరకమని' ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వార్తకు స్పందన లభించింది. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఈ రోడ్డు నిర్మాణానికి కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించి మాట్లాడారు. రూ.1.57 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందని, నియోజకవర్గంలో కొద్దినెలల్లో అన్ని రోడ్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. ఏలూరు- మేడిశెట్టివారిపాలెం రోడ్డుకు రూ.4.14 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. చింతలపూడి, ధర్మాజీగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లకు నాలుగు కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. పలు రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ అంబటి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ దుర్గాపార్వతి, మాజీ చైర్మన్ జె.ముత్తారెడ్డి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో ప్రజలతో ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతీ ఫిర్యాదును ఆయా శాఖలు సకాలంలో పరిష్కరించాలన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలి'


మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు రూరల్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన శ్రేణులు దృష్టి సారించాలని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో నియోజకవర్గ స్థాయిలో భవిష్యత్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయాన్ని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరులోని 50 డివిజన్‌లలోను కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వీరంకి పండు, ప్రధాన కార్యదర్శి సదిరి రాజేష్, ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, బుద్ధా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆట వస్తువుల బహూకరణ


పాఠశాలకు ఆట వస్తువులు అందిస్తున్న పాపారావు నాయుడు

నిడమర్రు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వసతుల కల్పనలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుదని లయన్స్ క్లబ్ గవర్నర్ లయన్ పాపారావు నాయుడు అన్నారు. శుక్రవారం భువనపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ గణపవరం వారు సుమారు 10 వేల రూపాయలు విలువైన ఐరన్‌బీరువాను బహూకరించారు. పాఠశాల ఆవర ణలో పిల్లలు ఆడుకోవడానికి జారుడు బల్ల, ఆటవస్తువులు అందజేశారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, ప్రెసిడెంట్ వెల్లంకి నరేష్, ప్రధానకార్యదర్శి కిలారి రవిబాబు, ట్రెజరర్ సత్యనారాయణమూర్తి, పోశింశెట్టిరామమూర్తి, నారాయణ శ్రీనివాసు , రావూరి నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంకు ఏసుబాబు, భారతి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫిషరీస్ కోర్సు ప్రయోజనాలపై అతిథి ఉపన్యాసం

ఏలూరు అర్బన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఫిషరీస్ డేని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కోల్‌కతకు చెందిన ఐఎఫ్‌బీ ఆగ్రో ఇండస్ట్రీస్ సీనియర్ టెక్నికల్ మేనేజర్ డాక్టర్ అమర్నాథ్ మాట్లాడుతూ ఫిషరీస్ కోర్సు ప్రయోజనాలు, ఉద్యోగావకాశాలు, మత్స్యరంగంలో ఎదురవుతున్న సమస్యలపై విద్యార్థులకు వివరించారు. యూజీ, పీజీ కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సా..గుతున్న రీసర్వే!

(5వ పేజీ తరువాయి)

70,943 ఎకరాలకు ఇప్పటి వరకు 54,070 ఎకరాలు పూర్తి చేసి 74 శాతం పురోగతి సాధించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇంకా 16,885 ఎకరాల సరిహద్దులు, పొలం గట్లు సర్వే చేసి లెక్కలను తేల్చాల్సి ఉంది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. డిసెంబరులో మొత్తం మూడు విడతలుగా చేపట్టిన సర్వే తాలూకా వివరాలను రెవెన్యూశాఖ వెబ్‌ల్యాండ్ పోర్టల్ అప్‌లోడ్ చేయనున్నారు.

పరిహారం..పాట్లు

(5వ పేజీ తరువాయి)

సమా చారం. దీనిని గుర్తించిన అధికారులు వెంటనే రికవరీ చేసినట్టు తెలిసింది. దీనిపై కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ సాంకేతిక లోపంతో పరిహారం రెండోసారి జమ అయ్యిందని వెంటనే రికవరీ చేసినట్టు తెలిపారు.



దుగ్గిరాలలో రహదారి శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న పట్టాభి, ఎమ్మెల్యే చింతమనేని.. రుద్రమకోటలో డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

వ్యర్థాల నిర్వహణతో ఆదాయార్జన

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పట్టాభి

పెదవేగి/దెందులూరు/ ఏలూరురూరల్/ఏలూరు కార్పొరేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యర్థాలే కదా అని నిరుపయోగంగా పడేయొద్దని, వ్యర్థాల నిర్వహణతో ఆదాయాన్ని పెంచుకునే దిశగా పంచాయతీలు చర్యలు తీసుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అన్నారు. శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం దుగ్గిరాల, దెందులూరు మండలం దెందులూరు, ఏలూరు మండలంలోని చాటపర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి రహదారులను శుభ్రపర్చడంతో పాటు మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, మనం చేసే పనులే ఆరోగ్యానికి సూచికలన్నారు. ఇంటితోపాటు వీధులను, తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడానికి అనువుగా దెందులూరు నియోజకవర్గానికి స్వచ్ఛరథం ఒకటి అందిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు రాష్ట్రంలో 205 యంత్రాలను సమకూర్చామని, ఒకదానిని దెందులూరుకు కేటాయిస్తామని, దీంతోపాటు ఎలక్ట్రికల్ ఆటోలను కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. దుగ్గిరాలలో డీపీవో కె.అనురాధ, ఇతర అధికా రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. దెందులూరులో తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత అధ్యక్షుడు మోతుకూరి నాని, దెందులూరు బ్యాంక్ అధ్యక్షుడు గారపాటి.కొండయ్యచౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు, తిలక్, సర్పంచ్ యేసమ్మ, తదితరులు ఉన్నారు.

గంగానమ్మకు పూజలు

ఏలూరు తూర్పువీధిలోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజుబాబు ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర జరిగే వివరాలను కమిటీ చైర్మన్ వంకినేని భానుప్రకాష్ ద్వారా తెలుసుకున్నారు.

● వేలేరుపాడు/కామవరపుకోట/లింగపాలెం, నవంబరు21(ఆంధ్రజ్యోతి):వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మ కోట గ్రామ పంచాయతీలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయ తీలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటికి తడి, పొడిచెత్త సేకరణ నిర్వహించారు. రుద్రమ్మకోట గ్రామంలో వీధులు శుభ్రం చేయడం, చెత్తను తొలగించటం, కాల్వలో పూడిక తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగం ఎల్లి స్వర్ణలత, ఉపసర్పంచ్ గుత్తేటి పావని, ఎంపీడీవో శ్రీహరి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సీఆర్‌పీలు, పాల్గొన్నారు. కామవరపుకోట మండలం కామవరపుకోటలో క్లీన్ అండ్ గ్రీన్‌పై అవగాహన ర్యాలీని ఎంపీడీవో వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.సరళకుమారి, పంచాయతీ కార్యదర్శులు కె.నాగరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. లింగపాలెం మండలం లింగపాలెంలో పారిశుధ్య కార్మికులకు క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి పారిశుధ్య కార్మికులకు, క్లాప్‌మిత్రలకు గ్రామాభివృధి, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వనరుల నిర్వహణ అమలుపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు సుగుణ రాజు, రాజు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

పేదలకు ఆసరాగా సీఎం సహాయ నిధి

ఏలూరుటూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):పేద ప్రజలకు ఆసరాగా సీఎం సహాయనిధి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ అజిమున్నీషాకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.41,365 విలువ గల చెక్కును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'చదువుల పేరుతో టీచర్లను వేధించవద్దు'

బుట్టాయగూడెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నైట్ స్టడీ, నైట్ హాల్ట్ విధుల పేరుతో ఉపాధ్యాయులను వేధించవద్దని ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్(ఏటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బుట్టాయగూడెంలో ఏటీఏ జిల్లా అధ్యక్షుడు సరియం నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడానికి గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జారీచేసిన ఉత్తర్వులు అసంబద్ధంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. హాస్టల్, స్కూల్ విధులు వేర్వేరుగా ఉంటాయని హాస్టల్ విధులను ఉపాధ్యాయులకు కేటాయించడంతోపాటు రాత్రి స్టడీ అవర్స్ నిర్వహించి హాస్టళ్లలోనే బసచేయాలని ఆదేశించడం వేధించడమే అవుతుందన్నారు. ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు తెల్లం రాములు, సోడెం రాజు, కుంజా రమేష్, తెల్లం గంగరాజు, పైదా సురేష్, ధర్ముల బాబూరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మల్లికార్జునరావు

రైతుల మేలుకే సొసైటీలతో ధాన్యం కొనుగోలు

లింగపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని తద్వారా అత్యధిక మద్దతు ధర కల్పిస్తుందని సింగగూడెం సొసైటీ అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. యడవల్లిలో స్థానిక నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. పలగాని సుబ్బారావు, నాయుడు మహేశ్, మేడూరి జయరాజు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా విద్యార్థినులకు బహుమతులు

ఏలూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీబీఏ, ఎంబీఏ విద్యార్థినులకు నిర్వహించిన జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ మీట్ మాగ్నస్-2025లో పలు ఈవెంట్లలో సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులు బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ ఓ ప్రకటనలో తెలిపారు. వర్డ్‌వేవ్ టైటిల్‌ను వి.రుద్రాణి, కె.మోహిత గెలుచుకోగా, వినూత్న మార్కెటింగ్ వ్యూహాలు, కార్పొరేట్ నైపుణ్యాల పోటీలో ఎ.వర్షిణి, ఎస్కే. ఫర్హీన్, ఎ.వైష్ణవి, కె.మోహిత ప్రథమ బహుమతిని గెలుచుకున్నారని వివరించారు. ట్రెండ్ స్పార్క్ పోటీలో ఎ.సృజితరావు స్వర్ణపతకాన్ని గెలుచుకుందన్నారు. విజేతలను అభినందించారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్మ్డు రిజర్వుడు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి. రామచంద్రరావు అనారోగ్యంతో మరణించడంతో కార్పస్ ఫండ్‌గా వచ్చిన లక్ష రూపాయల నగదు చెక్కును ఆయన భార్య టి. గౌరమ్మకు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు శుక్రవారం అందజేశారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు ఈ చెక్కును శుక్రవారం అందించారు. రామచంద్రరావు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలను అందిస్తామన్నారు. కుటుంబ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకానికి సిఫారసు చేస్తామన్నారు. పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, గౌరమ్మ కుమారుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.



భీమడోలులో విజేతలుగా నిలిచిన విద్యార్థులు.. ఏలూరులో బహుమతి అందుకుంటున్న సూర్య విద్యార్థి

'విజ్ఞానాన్ని అందించే నేస్తాలు గ్రంథాలయాలు'

భీమడోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞానాన్ని అందించే నేస్తాలు గ్రంథాలయాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సీనియర్ సభ్యత్వ దారుడు షాహిమా, ఉత్తమ పాఠకులు కడగల సత్యనారాయణ, లక్ష్మీలను ఘనంగా సత్కరించారు. తెలుగు పండిగుట్ల, అధికారులను శాలువాలను కప్పి సత్కరించి జ్ఞాపికలను అందించారు. వివిధ పోటీల్లో విజేతలు 200 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో తంగెళ్ళమూడి శ్రీసూర్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్‌రావు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో ఎ.శ్రేష్ఠ ప్రథమ, సీనియర్ విభాగంలో పి.భార్గవ్ ప్రథమ, వక్తృత్వం పోటీల్లో జూనియర్ విభాగంలో సీహెచ్ మహాలక్ష్మి ప్రథమస్థానం, సీనియర్ విభాగంలో కె.పవన్‌సాయి తృతీయ, దేశభక్తి గీతాల విభాగంలో డింపుల్ సాయి ప్రథమ, జోయా అంజుమ్ ద్వితీయ, ఎం.జశ్విత తృతీయ స్థానం సాధించారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు


బహుమతులు అందించిన సొసైటీ సభ్యులు

ఏలూరు రూరల్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఆర్ట్ సొసైటీ, ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సుబ్బమ్మ దేవి మునిసిపల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని చిత్రకళా ప్రతిభను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. గెలుపొందిన వారికి పాఠశాల హెచ్ఎం, ఎంఈవో అరుణ్‌కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏలూరు ఆర్ట్స్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు మజ్జి కాంతారావు, అధ్యక్షులు చిత్రాలయ రాంబాబు, భాష్యం దేవ్ పర్యవేక్షించారు.

మేదినరావుపాలెం-మండూరు రోడ్డుకు మోక్షం


మేదినరావుపాలెం- మండూరు నూతన రోడ్డు

దెందులూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా గుంతలతో ఉన్న రోడ్డుకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా మేదినరావుపాలెం-మండూరు ప్రధాన రహదారి గుంతలతో రాళ్లుపైకి లేచి అధ్వానంగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో మేదినరావుపాలెం గ్రామపరిధిలో 600 మీటర్లు వెడల్పుతో గ్రామం ఉన్నంత దూరం సిమెంట్ రోడ్డు నిర్మించారు. మరో నాలుగు కిలోమీటర్లు తారురోడ్డును రూ.మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు పూర్తి చేశారు. ఈ రోడ్డు ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారికి అనుసంధానమైంది. ఈ సందర్భంగా ఆయా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దు'

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు నగరంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ధర్నా జరిపారు. వైద్య విద్య ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.

కార్తీక పోలి స్వర్గం పూజలు

పెదపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో చివర రోజున మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక పోలి స్వర్గం పూజలు శుక్రవారం జరిగాయి. మహిళలు కాలువల్లో దీపాలు వదిలి పూజలు నిర్వహించారు. పెదపాడు శివారు కాలువల్లో శుక్రవారం తెల్లవారుజామున ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఆటో యూనియన్లకు ఎన్నికలు నిర్వహించాలి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):ఏలూరుటౌన్, రూరల్ పరిధిలోని ఆటో యూనియన్ల గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. ఏలూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆటో యూనియన్ జిల్లా మహాసభనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఏలూరు నగరంలో ఆటో కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన సీఐటీయూకు ఏలూరుటౌన్, రూరల్ పరిధిలో ఆటో యూనియన్‌లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఆటోస్టాండ్ పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, ఈ-చలానా రద్దు చేయాలని, నగరంలో అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. యూనియన్ నాయకులు మంచెల్ల ఇస్సాకు, జె.గోపి, నత్త వెంకటేశ్వరరావు, బి.చంద్రశేఖర్, ఎ.రాజు, కె.శ్రీను పాల్గొన్నారు.

యు-డైస్‌లో స్కూల్ అసిస్టెంట్ల కేడర్‌ను మార్చొద్దు : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ప్రాథమిక పాఠశాలల (ఎంపీఎస్) ప్రధానోపాధ్యాయుల (పీఎస్‌హెచ్‌ఎం) పోస్టులను కోరుకున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులకు యు-డైస్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కేడర్‌గా ఏకపక్షంగా నమోదు చేయడం పట్ల ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు జి.కృష్ణ, మోహన్, రామ్మోహన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. యు-డైస్‌లో స్కూల్ అసిస్టెంట్ల డిజిగ్నేషన్‌ను మార్చడం చట్టపరంగా పూర్తిగా అన్యాయమన్నారు. ఒరిజనల్ కేడర్‌నే యు-డైస్‌లో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. హైస్కూళ్లలో తెలుగు మాధ్యమాన్ని పునఃప్రారంభించి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీఎస్‌హెచ్‌ఎంలను యుడైస్‌లో స్కూల్ అసిస్టెంట్లుగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు.


కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరావు తదితరులు

రైతు బజారులోనే వ్యాపారాలు నిర్వహించాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'పరిష్కరించిన సమస్య మళ్లీ మొదటికి' అన్న శీర్షికన ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్‌తో పాటుగా పలు శాఖల అధికారులు స్పందించారు. రైతుబజారులో నిర్వహించాల్సిన కూరగాయలు, ఇతర వ్యాపారాలను పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై పెట్టి నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్న సంగతి తెలిసిందే. మార్కెటింగ్, పోలీసు, రెవెన్యూ, పంచాయతీతో పాటుగా ఇతర శాఖల అధికారులు శుక్రవారం వీధి వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుపై వ్యాపారాలన్నీ రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన రైతుబజారులో నిర్వహించాలన్నారు. ఆర్ఐ భారతి, ఈవో వినోద్, వీఆర్వో నరసింహ పాల్గొన్నారు.

విద్యార్థుల తాగునీటికి మోటారు అందజేత

ఏలూరు రూరల్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి) :వెంకటాపురంలోని శ్రీరామ్‌నగర్ ఎంపీయూపీ పాఠశాలలోని విద్యార్థులకు రక్షిత తాగునీటిని అందించేందుకు దాతలు యూవీ సత్యనారాయణ దంపతులు రూ.13,500 ఆర్థిక సాయం అందించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మంచినీటి మోటార్ అందించి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. హెచ్ఎం గోపి కిషోర్, ఉపాధ్యాయులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన కల్పించాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కె.ఎస్.కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధానికి ఐసీడీఎస్, సచివాలయ, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బాల్య వివాహాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిరోధకానికి చెందిన పోస్టర్లు ఆవిష్కరించారు. సీహెచ్‌వో టి.శ్రీరామమణి, వెలుగు ఏపీఎంలు ఎం.సుబ్రహ్మణ్యం, ఎ.రామారావు, ఎన్‌జీవో సభ్యుడు స్నేహన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పెదపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెదపాడు సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం కరెంట్ సరఫరా ఉండదని ఏలూరు ఈఈ ఎం.అంబేద్కర్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రెండు గంటల వరకు ఏపూరు, తాళ్లమూడి, అప్పనవీడు పరిసర గ్రామాల ప్రజలకు అంతరాయం కలుగుతుందన్నారు.

● ఏలూరు రూరల్ : పవర్‌పేట 11 కేవీ ఫీడర్ లైన్లకు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలు పుదల చేస్తా మని సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అం బేడ్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీఎన్‌టీ రోడ్డు, వసంత మహల్ సెంటర్, కర్రల వంతెన, పవర్‌పేట, పాత బస్టాండ్, పాండు రంగారావు, గూడ్స్ షెడ్ రోడ్డు పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

రహదారి మరమ్మతులు చేయించండి

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో మర్లపాలెం-యర్రావారిగూడెం గ్రామాల మధ్య రహదారి భారీ గోతులతో అధ్వానంగా తయారైందని వెంటనే మరమ్మతులు చేయించాలని నూజివీడులో మంత్రి పార్థసారథి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌లో మండల టీడీపీ నాయకుడు ఓబిళ్ళనేని సాయిబాబు వినతిపత్రం అందజేశారు. కేవలం 3 కిలో మీటర్ల దూరం ఉన్న రోడ్డు మీదుగా మండల ప్రజలు ఏలూరు పట్టణానికి, లింగపాలెం మండలానికి వివిధ పనుల నిమిత్తం వెళుతుంటారని వినతిపత్రంలో పేర్కొన్నారు.



ఘనంగా పోలి పాడ్యమి పూజలు

ఆగిరిపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం పోలిపాడ్యమి పూజలు మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి వద్ద తెల్లవారు జాము నుంచే మహిళలు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి నీటిలో వదిలారు.

సమస్యలు సత్వరం పరిష్కరించండి : మంత్రి



ప్రజాదర్బార్‌లో అర్జీలిస్తున్న ప్రజలు

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహ నిర్మాణ రంగాలకు సంబంధించి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధి కారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. నూజివీడులోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను (ప్రజా దర్బార్) నిర్వహించారు. దాదాపు 100 అర్జీలు దాఖలు అయ్యాయి. మంత్రి వర్చువల్‌గా పాల్గొని మాట్లాడుతూ అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలు, రెండో స్థానంలో గృహ నిర్మాణశాఖ సమస్యలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



హోరాహోరీగా సాగుతున్న పోటీలు

నూజివీడులో బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న డీఈవో

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ అండర్ 17 బాస్కెట్ బాల్ పోటీ లు నూజివీడులోని బెతెస్థ ఇంటి గ్రేటెడ్ స్కూల్‌లో ప్రారంభం అయ్యాయి. ఏలూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీఈవో ఎం. వెంకట లక్ష్మమ్మ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల్లో రాణించి పాఠశాలకు తద్వారా జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. నూజివీడు ఉప విద్యా శాఖాధికారి డా.పిఎస్ సుధాకర్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ అలివేలు మంగ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాకా నాగరాజు, ప్రముఖులు ఘంటా ప్రసాద్, బిస్ స్కూల్ అధినేత బండి శ్యామ్, హెచ్ఎం రామకృష్ణ, 13 ఉమ్మడి జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలపడిన జట్లు: తొలుత గుంటూరు, విజయనగరం జట్ల మధ్య పోటీ సాగగా విజయనగరంపై 38-04 తో గుంటూరు విజయం సాధించింది. అనంతరం పశ్చిమ గోదావరిపై చిత్తూరు 19-30 స్కోర్‌తో విజయం సాధింగా తూర్పు గోదావరి, శ్రీకాకుళంపై 31-02 స్కోర్‌తో విజయం సాధించింది. ఇక అనంతపురం-ప్రకాశం జట్ల మధ్య పోటీ ఏకపక్షంగా సాగి 15-0 స్కోర్‌తో అనంతపురం విజయం సాధించింది. కృష్ణా, వైఎస్సార్ కడప మధ్య సాగిన పోటీలో 15-03 స్కోర్‌తో కృష్ణా జట్టు విజయం సాధించింది. ఇక బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఈస్ట్ గోదావరి శ్రీకాకుళంపై 30-03 స్కోర్‌తో విజయం సాధించగా, వైజాగ్‌పై చిత్తూరు 30-33 స్కోర్‌తో నెల్లూరు వైఎస్సార్ కడపపై 22-10 స్కోర్‌తో, వెస్ట్ గోదావరి విజయనగరంపై 27 - 0 స్కోర్‌తో, కృష్ణా, ప్రకాశంపై 33 - 05 స్కోర్‌తో విజయకేతనం ఎగురవేశాయి.

త్రివిధ విద్యార్థుల ప్రతిభ



నూజివీడు టౌన్, నవంబరు 21, (ఆంధ్ర జ్యోతి): గ్రంథాలయ వారో త్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో నూజివీడు త్రివిధ పాఠ శాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. వక్తృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో సీహెచ్ సాహితి, గీతిక లక్ష్మీ, జాన్సన్, హన్సల్ నోయల్, ఆరుష్ పతకాలను సాధించారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

ఎస్టీయు మండల అధ్యక్షుడిగా అమరయ్య

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల ఎస్టీయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి. అమరయ్య, ఎస్. నరసింహారావు ఎన్నికైనట్లు పరిశీలకులు సుధాకర్, ప్రభాకర్ ప్రకటించారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా ఆడిమెల్లి రమేష్, కారుమంచి దేవి, ఆర్. అనూష, కార్యదర్శులుగా ఎ. విజయభాస్కర్, కవితా కుమారి, పి. రవి, ఎం లక్ష్మయ్య, జిల్లా కౌన్సిలర్లుగా జి. రాము, ఎస్‌కె మహబూ, ఎ. చెన్నారావు ఎన్నికైనట్లు ప్రకటించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

ముదినేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ముదినేపల్లి మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం ముదినేపల్లిలో జరిగిన సమాఖ్య వార్షిక కౌన్సిల్ సమావేశంలో మండల అధ్యక్షుడిగా అల్లూరు ప్రాథమిక పాఠశాల టీచర్ కట్టా యశోద కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సింగారం ప్రాథమిక పాఠశాల టీచర్ జి.సింహాచలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

సా..గుతున్న రీసర్వే!

(5వ పేజీ తరువాయి)

70,943 ఎకరాలకు ఇప్పటి వరకు 54,070 ఎకరాలు పూర్తి చేసి 74 శాతం పురోగతి సాధించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇంకా 16,885 ఎకరాల సరిహద్దులు, పొలం గట్లు సర్వే చేసి లెక్కలను తేల్చాల్సి ఉంది. ఎట్టిపరిస్థితు ల్లోనూ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయిం చుకున్నారు. డిసెంబరులో మొత్తం మూడు విడతలుగా చేపట్టిన సర్వే తాలూకా వివరాలను రెవెన్యూశాఖ వెబ్‌ల్యాండ్ పోర్టర్ అప్‌లోడ్ చేయనున్నారు.

పరిహారం..పాట్లు

(5వ పేజీ తరువాయి)

సమా చారం. దీనిని గుర్తించిన అధికారులు వెంటనే రికవరీ చేసినట్టు తెలిసింది. దీనిపై కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ సాంకేతిక లోపంతో పరిహారం రెండోసారి జమ అయ్యిందని వెంటనే రికవరీ చేసినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

వంతెనపై గుంతలు

- బయటపడిన ఇనుప చువ్వలు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



వంతెన పైభాగంలో పడిన గుంతలు (ఇన్‌సెట్‌లో) బయటపడిన ఇనుప చువ్వలు

కలిదిండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలను కలుపుతూ ఉప్పుటేరుపై ఉన్న మద్వానిగూడెం-ఏలూరుపాడు వంతెనపై భాగంలో గుంతలు పడి ఇనుపచువ్వలు బయటపడ్డాయి. ఇటీవల సంభవించిన మొంథా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో వంతెనపై పలు చోట్ల గోతులు పడి కంకర కొట్టుకుపోవడంతో ఇనుప చువ్వలు బయటపడ్డాయి. వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. వాహనాల టైర్లకు ఇనుప చువ్వలు గుచ్చుకోవడంతో పంచర్లు పడుతున్నాయి. భీమవరం-విజయవాడ రాష్ట్ర రహదారి ఈ వంతెనపై నుంచి వెళ్లడంతో నిత్యం హైదరాబాద్, విజయవాడ, గుడివాడ, భీమవరం బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనపై భాగంలో గోతులు అధికంగా ఉండడంతో ఇనుప చువ్వలు బయటకు వచ్చాయని గోతులు పూడ్చాలని అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వంతెన 37 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇప్పటివరకు శాశ్వత మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ వంతెనపై పడిన గోతులను పూడ్చాలని వాహనదారులు, ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్ చౌదరి

పేదలకు ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

కలిదిండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లు నిర్మించటమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి అన్నారు. శుక్రవారం వెంకటాపురంలో హౌసింగ్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకోవటానికి లబ్ధిదారులు ముందుకు రావాలన్నారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు బిల్లులను అధికారులు సకాలంలో చెల్లించాలన్నారు. వైసీపీ హయాంలో బిల్లులు చెల్లింపు జాప్యం జరగటంతో లబ్ధిదారులు పలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, హౌసింగ్ ఏఈఈ నాగబాబు, సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, వీఆర్వో కమల్ హసన్ పాల్గొన్నారు.



గోపవరంలో ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న నాయకులు

మద్దతు ధర అందించడమే ధ్యేయం

ముసునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంటలకు మద్దతు ధర అందించి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్ అన్నారు. శుక్రవారం గోపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందన్నారు. నాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీని బలోపేతం చేయాలి

- టీడీపీ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారంలో మంత్రి సారథి
- అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వైసీపీకి సవాల్



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీని బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పార్టీ నూజివీడు నియోజకవర్గ గ్రామ, మండల కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నూజి వీడులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన కమిటీలు ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయా లన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పథకాలన్నీ తాము ఇచ్చే పింఛన్లతో సమానం అన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మున్సిపల్ అభివృద్ధికి రూ.50 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, తల్లికి వందనం, ఆటో డ్రైవర్ల సంక్షే మం, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ పంపిణీ, ఎన్టీఆర్ వైద్యసేవ, పింఛన్లు, అన్నదాత సుఖీభవ, ఇలా దేశంలోనే సంక్షేమం, అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. మండల అధ్యక్షులు యనమదల శ్రీనివాసరావు, గద్దె రాము, వేణు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఎన్నారై ఒప్పందం



కృష్ణా జిల్లా కలెక్టర్, జేసీల సమక్షంలో ఒప్పంద పత్రాలతో ఎన్నారై ఇనిస్టిట్యూట్, రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రతినిధులు

ఆగిరిపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యా ర్థుల్లో నాయకత్వ లక్షణా లు పెంచి, భవిష్యత్ తరాల వ్యాపార వేత్తలుగా తీర్చిది ద్దేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఎన్నారై ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ టెక్నాల జీల మధ్య ఒప్పందం ఎంతో తోడ్పడుతుందని ఎన్నారై కళాశాల ప్రిన్సి పాల్ పి నాగభాస్కర్ అన్నారు. శుక్రవారం ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్.టి.ఐ.హెచ్) ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల మధ్య ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీషా, జాయింట్ కలెక్టర్‌తో పాటు, ఆర్‌టిఐహెచ్ సీఈవో జి కృష్ణన్ సమక్షంలో ఒప్పందమయ్యాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ ఆర్ వెంకటరావు మాట్లాడుతూ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగంలో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి ఈ ఒప్పందం ఎంతో తోడ్పడుతుందని అన్నారు.



గోపవరంలో చెత్త సేకరిస్తున్న దృశ్యం

పచ్చదనం పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి

- క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాలు
- క్లాప్ మిత్ర, కార్యదర్శులకు శిక్షణ



పర్వతాపురంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. పర్వతాపురంలోని సంపద తయారీ కేంద్రం ఆవరణలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ ప్రోగ్రాం కింద మండలంలోని క్లాప్‌మిత్రలకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్లాప్‌మిత్రలు గ్రామాల్లో నిత్యం ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించటంతో పాటు, రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, దీనిని పంచాయతీ కార్యదర్శులు నిరంతం పర్యవేక్షించాలని కోరారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్ళి చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దని, ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలో వేయాలని, ప్రతి ఇంటిలో కనీసం 2, 3 మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, సర్పంచ్ మిద్దె శివాజీ, టీడీపీ నాయకులు బొర్రా నాగేశ్వరరావు, బి. చెన్నారావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్మూలనకు కృషి చేయాలి

కైకలూరు: గ్రామాల్లో చెత్త నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో ఆర్ రాజాబాబు అన్నారు. శుక్రవారం గోపవరంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు గ్రామాల్లో చెత్తను దూర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, టీడీపీ నాయకుడు కంచర్ల రామకృష్ణ, ఏవో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం నెలకొల్పడమే లక్ష్యం

ముసునూరు: గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. మండలంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌గా ఎంపిక చేసిన వలసపల్లిలో శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న క్లాప్ మిత్రలు, హరిత రాయబారులు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం క్లాప్ మిత్రలు, హరిత రాయబారులకు తడి, పొడి చెత్త సేకరణ, సంపద కేంద్రాల్లో వర్మికంపోస్ట్ తయారీపై ఎంపీడీవో, రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ చలసాని దామోదరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మండవల్లి: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలని మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, మండవల్లి ఎంపీడీవో కె రమణబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం గన్నవరంలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ లక్ష్మీనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: గ్రామాల్లోని సంపద సృష్టి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో మురళీ మోహన్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం తాడినాడలో సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణ అనంతరం తాడినాడ గ్రామాన్ని ఎంపిక చేసుకుని గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్పంచ్ తాడినాడ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో మారుతి ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకులం టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

- పాఠశాల వద్ద పీడీఎస్‌యూ, కేవీపీఎస్, మృతురాలి బంధువుల ఆందోళన



కావ్య మృతదేహం.. సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పొడపాటి కావ్య(15) శుక్రవారం మధ్యాహ్నం తరగతి గదిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జంగారెడ్డిగూడెం మండలం లోని జొన్నవారి గూడెంకు చెందిన పొడపాటి గంగాధరరావు, ఉషారాణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మృతురాలు కావ్య పెద్ద కుమార్తె. ఆమె ఐదో తరగతి నుంచి స్థానిక గురుకుల పాఠశాల హాస్టల్‌లోనే చదువుతోంది. రెండో కుమార్తె సౌమ్య అదే గురుకుల పాఠశాలలో ఆరో తరగతి, మూడో కుమార్తె మోక్ష స్వగ్రామంలోనే నాలుగో తరగతి చదువుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామంలో తన తోటి విద్యార్థినులంతా భోజనానికి వెళ్లగా కావ్య తర్వాత వస్తానని చెప్పింది. అనంతరం ప్రతిరోజూ తాను కూర్చునే బెంచీపైకి ఎక్కి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆమె ఇంకా భోజనానికి రాకపోవడంతో మెస్ ఇన్‌చార్జి ఆమెను తీసుకురమ్మని ఆమె స్నేహితులను పంపించడంతో తరగతిగది వద్దకు వారు వెళ్లి ఫ్యాన్‌కు వేలాడుతున్న కావ్యను చూసి భయంతో కేకలు వేశారు. ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ సెక్యూరిటీ సిబ్బంది సాయంతో కిందకు దింపి అంబులెన్సులో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సీఐ ఎంవీ సుభాష్, ఎస్ఐ ఎన్‌వీ ప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రిన్సిపాల్ గంగా భవానీతో పాటు మహిళా ఉపాధ్యాయులను, కావ్య స్నేహితులను విచారించారు. బాలిక తల్లి ఉషారాణి కొన్నే ళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోందని ఆ బాధ చూడలేక చదువు మానేయాలని ఉందని పలుసార్లు చెప్పి బాధపడిందని స్నేహితులు తెలిపారు. సీఐ మా ట్లాడుతూ సీసీ ఫుటేజీ పరిశీలించా మని, డాగ్ స్క్వాడ్, వేలి ముద్రల నిపుణులతో దర్యాప్తు చేపడ తామన్నారు. మరోవైపు బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని పీడీఎస్‌యూ, కేవీపీఎస్‌తోపాటు మృతురాలి బంధువులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు.

రైలు గేట్ వేసేస్తున్నారని..

- రెండు మోటార్ సైకిళ్ళు ఢీ.. ఒకరి మృతి
- ఏఎంసీ మాజీ ఛైర్మన్‌కు తీవ్ర గాయాలు

మండవల్లి: మండలం లోని చావలిపాడులో శుక్రవారం రైల్వేగేటు వద్ద రెండు మోటారు సైకిళ్ళు ఢీకొని యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం కైకలూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ తలారి వెంకటస్వామి, కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన పడమటి సత్యనారాయణ (25) కైకలూరు నుంచి మండవల్లి వైపు వస్తున్నారు. రైలు గేటు వేస్తున్నారని ఇద్దరూ వేగంగా మోటారు సైకిళ్ల నడుపుతూ ఒకదానికొకటి ఢీకొనడంతో ఇద్దరు కిందపడిపోయారు. సత్యనారాయణ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, వెంకట స్వామికి తీవ్ర గాయాలవడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గాయపడిన వెంకట స్వామిని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

డిఫెన్స్ ఉద్యోగిపై దాడి

ముదినేపల్లి: మండలంలోని వైవాకలో జరిగిన స్థల వివాదంలో డిఫెన్స్ ఉద్యోగిపై దాడి చేసి కొందరు తీవ్రంగా గాయపరచిన సంఘటన ఇది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మండే రాంబాబు చెన్నైలో డిఫెన్స్ మంత్రిత్వ శాఖకు చెందిన అవధి హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీలో వర్క్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. 2029లో రిటైర్ కానున్నందున స్వగ్రామమైన వైవాకలో ఇల్లు నిర్మించుకునేందుకు రెండేళ్ల క్రితం 9 సెంట్లు స్థలం కొనుగోలు చేశాడు. వారం క్రితం ఆయన వైవాక వచ్చి స్థలాన్ని బాగు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన అబ్రహాం, దావీదు, వినోద్, రాణి, బుడ్డమ్మ ఆ స్థలం తమదంటూ రాం బాబును అడ్డుకున్నారు. ఈ నెల 9న నిందితులు ఆ స్థలం చుట్టూ చెట్ల కొమ్మలు పాతుతుండడంలో అభ్యంతరం తెలిపిన రాంబాబుపై వారు మూకుమ్మడిగా దాడి చేసి స్థలం జోలికి వస్తే చంపేస్తామని బెదిరించారు. సమస్య పెద్దల్లో పరిష్కారం కాకపోవడంతో బాధితుడి భార్య శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చిగురుకోట 132/33కెవి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా కైకలూరు, కలిదిండి మండలాల్లోని అన్నీ గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతులు, నూతన విద్యుత్ లైన్ల నిర్మాణ పనులను చేపడతామన్నారు. అందువల్ల కైకలూరు, పల్లెవాడ, వరహాపట్నం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ముదినేపల్లి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. పెదకామనపూడి, చిగురుకోట, చినకామనపూడి, బొమ్మినంపాడు, రాజానగరం, సింగరాయపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీహరిపురం పెదగొన్నూరు, ఈడేపల్లి గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నూజివీడు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నూజివీడు తహసీల్దార్ బద్రు అన్నారు. నూజివీడు మండల పరిధిలోని 26 రెవెన్యూ గ్రామాలకు పది క్లస్టర్లుగా ఏర్పాటు చేశామని, నిబంధనల ప్రకారం వరి పండించి ఈ క్రాప్ పూర్తయిన రైతులంతా ఆర్ఎస్కేలను సంప్రదించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. సివిల్ సప్లైస్ డీటీ డీవీ రావు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండవల్లి ఏడీఏ జి వెంకటమణి కోరారు. శుక్రవారం పెయ్యేరులో ఏఓ వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన పొలం బడిలో ఆమె మాట్లాడుతూ ధాన్యాన్ని ఆరబెట్టి 17 శాతం తేమ మించకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులకు ఐపీఎం కిట్లను పంపిణీ చేశారు.

సామాజిక తనిఖీలు సమర్థంగా నిర్వహించాలి

ముసునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఆడిట్ బృందాలు సామాజిక తనిఖీలను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. శుక్రవారం ముసునూరులో ఉపాధి సిబ్బంది, పంచాయతీరాజ్, హౌసింగ్ అధికారులు, ఆడిట్ సిబ్బందితో ఏపీవో అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై శనివారం నుంచి సామాజిక తనిఖీలు జరుగుతాయని, వారికి సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి, సమగ్ర రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

'తృతీయ ప్రత్యామ్నాయం అవసరం'

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వామపక్ష ప్రజాస్వామ్య లౌకిక శక్తులతో తృతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటు అవసరమని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ అన్నారు. చాట్రాయిలో శుక్రవారం నిర్వహించి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్‌కి అనుకూలంగా కూటమి పాలన సాగుతున్నదని, వైసీపీ బాధ్యతగల ప్రతిపక్షంగా వ్యవహరించటం లేదని విమర్శించారు. కడపలో జరిగే లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మద్యపానం ఆరోగ్య ప్రభావం, డ్రగ్స్ వద్దు బ్రో అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శుక్రవారం కైకలూరు బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి వినోద మాట్లాడుతూ విద్యార్థులు మద్యం, డ్రగ్స్ వలన ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోతారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. జోనల్ కోఆర్డినేటర్ ఎం. లీలావతి, కైకలూరు పంచాయతీ కార్యదర్శి జి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.